404

పాలపిట్ట

[సాహిత్యవ్యాససంపుటి]

404
2-56

★

OFFICE OF THE REGISTRAR OF BOOKS
5 - MAY 1956
MADRAS

తిమ్మావజ్ఝుల కోదండరామయ్య

★

సారస్వతకుటీరము
...దరాసు -21.

TL
035,6x
3Sm56.
15580 7

పారస్వతకుటీరగ్రంథమాల 3.

పాలపిల్లి

[సాహిత్యవ్యాససంపుటి]

Pala pelli.

(T) కొడంతరామయ్య:
తిమ్మావజ్ఝుల కోదండరామయ్య,
ప్రధానాంధ్రోపన్యాసకుఁడు,
సర్ త్యాగరాయకళాశాల, మదరాసు.

S.No: 2457
Acc No: 26276.

సర్వస్వామ్య సంకలితము

1956

వెల :
ఒకరూపాయ

మన్మథ
మకర సంక్రాంతి

15548

ప్రతులు

అయిదువందలు

TL
035.6 x
35 N56

వెల్డను ప్రెస్సు,
మదరాసు-21.

గురువర్యులు

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి

భక్తిపూర్వకముగా

సమర్పితము.

మనవి

సాహిత్యమునకు సంబంధించి యప్పుడప్పుడు నేను వివిధపత్రికలలో ప్రకటించినవ్యాసములనే యీ 'పాలవెల్లి' గా నిప్పుడు సంతరించితిని. మగువమాంచాల మొదలుగా నిందలి వ్యాసము లను దమపత్రికలలో ప్రకటించుటయే కాక యిప్పు డిట్లు వాని నెల్ల పుస్తకరూపమున నచ్చొ త్తించుకొనుటకు దమ యనుమతి యొసగినయా యాయిపత్రికాసంపాదకులకు గృతజ్ఞుడను. ఇందలి వ్యాసములు సాహిత్యాధ్యయనము చేయ గోరువిద్యార్థులకు 'గోరుముద్ద' లగుచో నదియే నాకు బదివేలు. విశ్వవిద్యాలయమువారును, విద్వాంసులును దీని నాదరింతు రనియే విశ్వ సింతును.

నేను రచనకు దొడగినదాది హృదయ పూర్తిగా నన్నాశీర్వదించుచు నీకృతియందలి యోగ్యతచే గాక నాయందలి వాత్సల్యముచేతనే యీ చిన్ని పొత్తమునకు 'పరిచయము' వ్రాసిన పూజ్యులు శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారికి గృతజ్ఞుడను.

దీని నింత సర్వాంగసుందరముగా నచ్చొ త్తించి యిచ్చిన 'వెల్డనుప్రెస్సు' వారి నభినందించు చున్నాడను. ఈగ్రంథముద్రణమున నాతో బాటు పరిశ్రమించిన చిరంజీవి వెంకట సుబ్రహ్మణ్యమునకు నాయాశీస్సులు.

—తిమ్మావజ్ఝుల కోదండరామయ్య.

పరిచయము

శ్రీరాముని కోదండమునుండి తొట్టఁదొలుత వెలువడినశబ్దము నాలకించుచునే ' దీనిది గొప్ప జాతక'మని భవిష్యపురాణమునఁ జేర్చుకొంటిని. నాకల నిక్కలయే యాయెను. భవిష్యపురాణము వర్తమానపురాణముగనే పరిణమించెను.

ఈ పాలవెల్లిలో ఆఱుదీవు లున్నవి. ఇవి సాహిత్య క్షేత్రములు. వీనిని దర్శింపఁ దలఁపనివా రుండఁ బోరు.

సాంయాత్రికులు పాలవెల్లిలో పచ్చపచనయిన యా దీవులలో దొరకు మాంచాలమనోరత్నము, మాల దాసరి కృతజ్ఞత, జాలి అనుతేనియ, శాలీనుని హృదయగుహలోని కెంపు, బొల్లావు పాలు అను సరకులను చాల సులభముగాఁ దెచ్చికొనవచ్చును. తెచ్చికొనుటయే యేమి? వీనిని చుబ్బనచూఱలుగాఁ గొనవచ్చును.

ప్రాజ్ఞులకుఁ గూడ నివి అపుడపుడు గజినిమీలికయే. వేయేల? విజ్ఞులకును విద్యార్థులకుఁ గూడ నీ చిఱు పొత్తము విత్తమే కాఁగలదు.

చిరివాడ,
కృష్ణా,
19-1-1956.

వేలూరి శివరామశాస్త్రి.
శతావధాని.

విషయానుక్రమణిక

—: o :—

౧. మగువ మాంచాల	...	1
౨. దమయంతి పెండ్లి	...	18
౩. మాలదాసరి	...	29
౪. శాలీనుఁడు	...	43
౫. కాటమరాజు	...	55
౬. చిత్రాంగి	...	76

మగువ మాంచాల

శ్రీ నాథుని పలనాటివీర చరిత్రములో మగువ మాంచాల, అనపోతు మఱిపునకు రానిమధురమూర్తులు. బ్రహ్మనాయుని ప్రభుభక్తికంటెను, బాలచంద్రుని బలపరాక్రమములకంటెను గూడ నందు ముందుగఁ బాఠకుల హృదయము నాకట్టఁగలిగినవి మగువమాంచాల మధురహృదయము - అనపోతు అమాయకభక్తి. పాఠకుల సానుభూతి తొలిసారిగా వీరివంకకే మఱలు ననుటలో సందేహము లేదు.

మాంచాల గండువారింటి యాడుపడుచు. ప్రఖ్యాత పలనాటివీరుఁడు గండుకన్నమనీఁడు ఈమెకుఁ దండ్రి. రేఖాంబ తల్లి. మాంచాలకుఁ జిన్నతనమునసే వివాహముఁ జేసినారు. పలనాటి కృష్ణుఁడు బహ్మనాయుని కుమారుఁడు బాలచంద్రుని కిచ్చి మహావైభవముగా వివాహమహోత్సవము జరగినది. వివాహమునాఁడు,

'.....ఒక చెనటివిప్రుండు
చూడఁగా లేక యసూయ పెంపొంద
సౌందర్య మన్నది చానకు సున్న
యెట్లు గావించినా రీ వివాహంబు
అని పల్కినో యేమొ...'—

కాని బాలచంద్రుఁడు పెండ్లినాఁటినుండియే యామె నొల్ల లేదు. పెండ్లినాఁడు కూడ వీ రొకరి నొకరు సరిగాఁ జూచుకొనలేదు. బాలచంద్రుని మొగము మాంచాల

యెఱుఁగదు. మాంచాల చాలికను బాలచంద్రుఁ డెఱుఁగఁడు. వారియింటికి వీరియింటికి రాకపోకలు లేవు. బాలచంద్రుఁ డెన్నఁడు నత్తవారింటికిఁ బోలేదు. మాంచాల గడప విడిచి కాలు కదపనియిల్లాలు. బాలచంద్రుని యత్తవారికిఁ బౌరుషము మెండు. అల్లుఁడు కూతురి నొల్లక యల్లరిచిల్లరగాఁ దిరుగుచున్నాఁడని వారు పల్లెత్తుమాట యనలేదు. ఆడుపడుచు నత్తవారింటికిఁ బంపక యింట నుంచుకొన్న నలుగురు నేమైన ననిపోవుదు రని యలుకలేదు. వియ్యపువారు కలుగఁజేసికొన కున్నా రని కయ్య మాడలేదు. కూతురికి భరణ మిమ్మని గోజాడలేదు. వారు 'అర్థంబు కలవాఁడు.' 'చేసికొన్నవారికిఁ జేసికొన్నంత మహాదేవ' యని వారు ఊఱట నెందినారు. మాంచాలయు మగనిఁ బల్లెత్తుమాట యనదు. ఆమెది యొక మధురప్రకృతి!

బాలచంద్రుఁడు మంచిపరువమున నున్నాఁడు. పరువము కన్నులఁ దట్టి ప్రపంచమే యతనికిఁ గానరాకున్నది. ఇఁక మాంచాల మాట యేమి? అతనికిఁ దోడుపోయిన యేడుగురు తమ్ములతో నాటపాట లేమో యతఁ డేమో! ఆటపాటలలో నలసి సొలసి సరసమున కాతఁడు శ్యామాంగి యింటి కేఁగును. ఇల్లాలి నొల్లనివారికి వెలయాలు మగనాలు! బాలచంద్రుఁడు,

'వెలయ భుజించుట వేశ్యగేహమున
విడియంబు చేయుట వెలయాలియింట
సౌఖ్యంబు పొందుట సానిధామమున'—

ఏడేండ్లుగా బాలచంద్రుని జీవితము సానిదానితోడి సరసముతోఁ జక్కఁగా సాగిపోవుచునే యున్నది. మాంచాలకు ఒక అచ్చట లేదు. ముచ్చట లేదు. 'అయ్యో!' యను వారు అంతకంటెను లేరు.

అపుడు కార్యమపూడి కదనరంగములో మలిదేవాదులకు నలగామని సైన్యములతో సమరము ముమ్మరముగా సాగుచుండినది. బ్రహ్మనాయుఁడు బాలమలిదేవునికిఁ బట్టము గట్టి బాలచంద్రుని వీటికిఁ గావలి యుంచి మూఁడు నెలలు మితి నెప్పి 'కులపగ' దీర్చుటకై మలిదేవాదులతోఁ గలసికలని కేఁగినాఁడు. వీటిలోఁ బెద్ద లందఱు యుద్ధవాటిలో గాటముగా సమరము సాగించుచున్నారు.

బాలచంద్రుఁడు 'చాలురావుల'కడ బొంగరము లాడుచుండఁగా వైపు దప్పి యాతని బొంగరము కోమటి యన్నమ్మను దాఁకినది. 'నొప్పి కల్గుటచేత నో రాప లేక' యామె యసరానిమాట లనినది.

'మాయయ్య లెల్లను మించినబలిమిఁ
జేరి వైరులతోడ శ్రీయుద్ధభూమి
నుప్పొంగుచున్న వా రుర్వీశునెదుట
వారిలోఁ గలయు నీవడి కానవచ్చు'

ననినది. బాలచంద్రుఁడు రోషపరవశుఁ డై యుద్ధభూమికేఁగ నిశ్చయించినాఁడు. ఐతమ్మ యెంతో వారించినది. బతిమాలినది. బాలచంద్రుఁడు తన నిశ్చయమునుండి సడల లేదు. ఇఁక లాభము లే దనుకొని యామె కుమారునితో –

'సమరంబునకు నేగుశౌర్యవంతులకుఁ
దల్లిదీవనఁ బొంది తగ భార్యచేత
దీపన గొని పోవఁ దేజంబు సుమ్మా
నడచిరి పెద లీనయమారమునను' అనినది.
బాలచంద్రుని గొంతులోఁ బచ్చివెలఁగకాయ పడినది.
తల్లిదీవన యయితే నేదో యొకవిధముగాఁ గైకొనవచ్చును.
కాని 'కులకాంత దీవన గొనుట యేలాగు' నని యతని
సందేహము. తనతప్పు తనకు బాగుగా నెఱుకయే. కాని
యిపుడు తా నేమి చేయఁగలఁడు? ఆడువారిపై నతని కంత
సద్భావము లేదు. తల్లిమాటపైఁ దాను వారియింటికిఁ
బోయినపు డిల్లాలు కినిసి తప్పు లెన్ను ననియుఁ దన కపుడు
చిన్నతన మగు ననియు నతని దిగులు. అందులకే

'పూర్వజన్మఫలంబు పొందికఁ బట్టి
ఆలుమగలఁ జేసె నజుఁడు మమ్ములను
నాభాగ్య మేమియు నాతి యెఱుంగ
దింతికి దుఃఖంబు హెచ్చుగ నుండె
నపరాధ మధికమే యమ్మ నాయందు
ఈ సమయంబున నే నేఁగరాదు'

అని తల్లికి తన మనసు నెఱింగించినాఁడు. ఐతమ్మకు వ్యవ
హారములోని చిక్కు తెలిసి వచ్చినది. గండువారింటికిఁ
బోయి సంగతిసందర్భము లెట్లున్నవో తెలిసికొని వచ్చు
టకుఁ దానే బయలుదేరినది. ఐతమ్మకు గండువారింట
ననుకోనిసత్కారమే లభించినది. రేఖాంబ యెదురు వచ్చి

కొనిపోయి కనకపీఠమునఁ గూర్చుండఁ బెట్టినది. 'మమ్మ్మఁ
జూడ వచ్చుట మాభాగ్య' మనినది. ఐతమ్మకు నున్నటు
లుండి యీ యనుగ్రహము కలుగుటకుఁ గారణ మేమో
మాంచాలకుఁ దెలియును. మేడపైనుండి దిగివచ్చి యత్తలకు
నమస్కరించినది. చందనతాంబూలాదు లొసఁగి సత్కరించి
నది. ఐతమ్మమనసు ఆర్ద్రార్ద్ర మైనది. మాంచాల నెట్టు
లైన నొప్పించినచో-బాలచంద్రుఁడు గండువారింటికి వచ్చి
నచోఁ-దనకు రెండు కోరికలు సిద్ధించును. బాలచంద్రుని
యుద్ధమునకుఁ బోకుండ నాపుట యొక్క-మాంచాలకే చేత
నగునని. మాంచాల యతిలోకసౌందర్యము నీక్షించిన
తరువాత బాలచంద్రుఁడు తన ప్రయత్నమునుండి విరమించు
కొను నని యామెకు నిశ్చయముగాఁ దెలియును. మాంచాల
సౌందర్యముమీఁద నామె కంత గట్టి నమ్మిక కలదు.
మాంచాలను జూచుట తటస్థించినచో నిల్లాలి నొల్లక
యల్లరిచిల్లరగాఁ దిరుగుచున్న బాలచంద్రుఁడింటిపట్టున నుండి
కోడలితోఁ దిన్నఁగాఁ గాపురము వెలిఁగించు నని యామెకుఁ
గొండంత యాశ. బాలచంద్రుని యుద్ధమునకుఁ బోకుండ
నాపుటకు మాంచాల తిరుగు లేనిదివ్యాస్త్ర మని యామెకుఁ
దెలిసియే—

' నేరంబు లతనివి నిలుపకు మదిని
రట్టు చేసితి వేని రాఁడు వాఁ డిటకు
నిన్ను వీక్షించిన నిలువంగ నోపు '

నని 'జరిగిన దేదో జరగి పోయినది. అది మనసున నుంచు కొనక బాలచంద్రునిఁ బిలిపింపు' మని ప్రార్థేయపడినది.

ఈసందర్భములో మాంచాల కాక మఱియొకమగువ యయి యుండినయెడల నైతమ్మకు నెట్టిసమాధాన మిచ్చి యుండునో మనకుఁ దెలియును. మాంచాల మధురహృదయ మిచ్చటనే ముచ్చట గొలుపుచున్నది.

'భోగంబు నొందెడుపొలఁతులు వారు
చావ నోఁచినయట్టిసకియను నేను
సరి చేసి యీమాట సభ నెన్నరాదు.

* * *

నిబుద్ధి కెన్నఁడు నే వెలి గాను
తెఱవరో మదిని సందియమును వదలి
పంపుము బాలునిఁ, బగ తీర్చుటకును
బోయెడు పయనంపుబుద్ధి మాన్పింతు'

నని యైతమ్మకు మాట యిచ్చినది. ఐతమ్మ కోడలికిఁ బుత్తడికమ్మిచీరలు పెట్టి వియ్యపురాలిచే వీడ్కోలు నంది నిజమందిరమునకు వచ్చినది. చెప్పవలసిన నాలుఁగుమాటలుఁ జెప్పి యామె బాలచంద్రుని గండువారింటికిఁ బంపినది. బ్రాహ్మణులకు భట్రాజులకు దాన మిమ్మని మాడలు, చీరలు, మణిభూషణములు పంపినది. బాలచంద్రుఁడు తిన్నఁగా మాంచాలయింటికిఁ బోలేదు. మార్గమధ్యమునసే కాఁబోలు శ్యామాంగి గృహమున కేగినాఁడు. కల్లబొల్లిమాటలు చెప్పి 'ముదివానరమువంటి ముసలి' వేశ్యమాత కలిగినది గవంత కాఁజేసినది.

'ఎన్నినా ళ్లగు నొకో యీకార్యసరణి
అన్నపుఖర్చున కాకుపోకలకు
ఈనున్న దేమైన నిపుడె యిప్పింపు'
మని శ్యామాంగి యున్నది రవంత యూడ్చుకొనినది. వట్టి చేతులతోఁ బోవుచున్న బాలచంద్రాదులకు బ్రాహ్మణవర్గ మెదురు వచ్చినది. వారికిఁ గోరినది మ్మనఁగా అనపోతు ఆగ్రహాపరవశుఁడై 'కలధన మెల్ల బోగముదాని కిచ్చి' నందులకై యతనిఁ దెగడినాఁడు. బాలచంద్రుఁడు తలవంచి, చేయునది లేక 'మణిచుట్టు తప్పించి మాణిక్యఖచితకనక మయాంచితకటిసూత్రము' తీసి వెలమలదోర్మనిచేతి కిచ్చి దానిమూల్యమును బ్రాహ్మణులకు భట్టులకు నిమ్మనినాఁడు.

బాలచంద్రుఁడు మహావైభవముగా నలంకరింపఁబడి యున్న గండువారింటికి వచ్చి రత్నకంబళములు పఱచి యున్నచవికెలోఁ దమ్ములతో నాసీనుఁడయినాఁడు. రాక రాక యల్లుఁడింటికి వచ్చినందులకు నింటిల్లిపాదికి నెక్కడ లేని సంతోషముగా నున్నది. చెలికత్తెలు మాంచాలను జక్కఁగా నలంకరించినారు. పదములపై పారాణి, కనుల యందుఁ గాటుక, నీలాలగాజులు నామె కొక క్రొత్తసొగ్గ్యమును దెచ్చిపెట్టినవి. అల్లుఁడు వచ్చినందులకు రేఖాంబ యుప్పొంగి పోయినది. ఆమె యానందమునకు మితి లేదు. ఎవరి సందడిలో వా రున్నారు. కాని మాంచాల కొక గట్టి చిక్కు ఏర్పడినది. ఈవిషయమే యచట నెవరికిని దోఁచినట్లు లేదు. వారి కెవరికిని నీవిషయమునుగూర్చి యాలోచించునంత

వ్యవధి చిక్కలేదు. అది పూర్తిగాఁ దనకు సంబంధించిన సమస్య! తా నితరుల నడిగి యైనఁ దెలిసికొనక మాంచాల యెట్లూరకుండఁ గలదు? ఊరకున్న వ్యవహారము చెడును. అందుకే తెగించి తల్లికడకుఁ బోయి—

'అమ్మ! నీ యల్లుని నస లే నెఱుంగ
నేరీతిఁ దెలియుదు నేయుపాయంబు
పతి యని యితరుల భావింపఁగూడ
దాభంగిఁ జేసిన నపరాధ మగును
హాస్యంబు చేయుదు రక్కడివారు
పంపుము గుటి సెప్పి పనతిరో!'

యని యడిగినది. రేఖాంబకు వ్యవహారములోని చిక్కు తెలిసి వచ్చినది. కాని యామెకు లోకపరిజ్ఞాన మెచ్చు. అందుకుఁ దగినయుపాయమునే యాలోచించినది.

'నీ వటు పోయిన నినుఁ జూచినపుడు
లేతురు మఱఁదులు లేవఁడు వరుఁడు
గుఱుతు సెప్పితి నేఁగు కూతురా!'

యనినది. మాంచాలకుఁ బట్టుకొన్న సందేహము దొలఁగినది. తల్లి చెప్పినగుఱుతు యుక్తిసహముగనే యున్నది. ఇఁక భయము లే దనుకొనినది. పన్నీరు నింపినగిండి గొని బాల చంద్రుఁడున్న చవికెలోనికిఁ బోయినది. ఈమెను జూచినదే యామె మఱఁది లార్వ్వఱు లేచి నిలుచుండిరి. కాని యన పోతు మాత్రము 'లేచినఁ బాపంబు లేమకుఁ జెందు' నని

లేవ లేదు. కూర్చున్న యిరువురిలోఁ దనమగఁ డెవఁడో తనకుఁ దెలియ లేదు. అనపోతు బంగారుపసిమి చాయ గల వాఁడు. ఆతనిఁ జూచి యతఁడే తనమగఁడు కాఁబోలు ననుకొని పన్నీటితో నతనిపాదములు కడుగఁ బోయినది. అనపోతు అదరిపడినాఁడు. అతనికి విషయ మర్థ మైనది.

'నేను బాలుఁడఁ గాను నిజము మాతల్లి
మఱఁది బ్రాహ్మణుఁడను మగువ నానామ
మనపోతు.....'

నని తనప్రవర చెప్పుకొనినాఁడు. మాంచాల కనుగ్రుడ్లనీరు నిలిచినది. ఆమెహృదయ మపు డొక మహాసముద్రము! ఎంతటి పొంగు వచ్చినను నది చెలియలికట్ట దాటదు. మఱఁదిని జూచి–

'మఱఁదియో యెఱుఁగను మగఁ డొకో యెఱుఁగ
భయ మొంద నేటికి బ్రాహ్మణో త్తముఁడ!''

అనినది. ఈమాటలలో మహాసముద్ర మంత యామె హృదయ మిమిడి యున్నది.

'పరిచయమే లేదు పతికిని నాకు
బాలచంద్రుం డిప్డు వచ్చెను గనుక
నేను పూర్వమునందు నియమంబుతోడఁ
జేసినతప మంత సిదించె ననుచు
హర్షంబు నొందితి నాత్మలోపలను
బాలుఁడు మ మ్మిఁకఁ బాయక యున్న
మాభాగ్య మిల నసమానంబు గాదె'

యని యాశించినది. పన్నీరు దెప్పించి మగనిపాదములు కడిగి—

'ప్రాణాంగనలఁ గనవచ్చెదునప్పు
డితరులఁ దెచ్చుట యేపాటి నీతి'

యని మందలించినది. ఈ మందలించుటలో వీరి నందతీని గొనివచ్చి నన్నెంతగాఁ జిక్కులలోఁ బెట్టితివి యనుభావమును స్ఫురింపఁదగును. 'ఏకాంతమున నుందము. వీరి నెల్లరఁ బంపివేయుము' అన్న సూచనయు నిందు సూచితము. బాలచంద్రుఁడు తమ్ములను దొలఁగి యుండుఁ డనినాఁడు. వారును దమలోఁ దాము నవ్వుకొనుచుఁ బరిహాసముగా నన్నట్లుగానే కర్తవ్యమునుగూర్చి—

'కలనిలో నున్నట్టిఘను లెవ్వరయ్య
యీసుఖమే దక్కె నెవరు నా కేల
యని చూడఁ గూడునా యపకీర్తి వచ్చు'

నని హెచ్చరికఁ జేసి, యేడుజాములదాఁక మాంచాలతో నుండుటకు బాలచంద్రునికి మితి సెప్పి వైదొలఁగి చనినారు.

ఇఁక నక్కడ నున్నది బాలచంద్రుఁడును, మాంచాలయు. కట్ట తెగినప్రవాహమువలె మాంచాలహృదయము ఉబుకలు వేయసాఁగినది. బాలచంద్రుని మేడమీఁదికిఁ బిలుచుకొని పోయినది. చిత్తరువులఁ జూపినది. చిలుకలఁ బలికించినది. శృంగారోద్యానమును గానిపించినది. తనకుఁ బ్రొద్దు వోవుటకై పెద్దలు పెంపొందించిన భర్మపాంచాలికా వ్రాతముఁ జూపి యం దొక బొమ్మ నాడించి మగనికి వినో

దము గొలిపినది. బాలచంద్రుఁడు మాంచాల ముగ్ధ మోహన మయిన సౌందర్యమును జూచి ముగ్ధుఁ డయినాఁడు. హంస తూలికాతల్పమున శయనించి యున్న మగనికి మాంచాల ముత్యాలపీట పైఁ గూర్చుండి తమ్ములపాకులు చిలుకలు చుట్టి యొసఁగినది. బాలచంద్రుని యధరము మాత్రమే కాక హృదయమును రాగరంజిత మయినది. బాలుని భావ మెఱిఁగి యాయత్తపడి వత్తు నని మాంచాల లేచి పోయినది. పన్నీట నీళ్ళు లాడి సింగారించుకొని 'బిడ్డలయాశలఁ బ్రియ మునఁ దీర్చి, జననితో సమ మైనజంతువు లేదు' కావునఁ దన కున్నకష్ట మెల్ల వెళ్ళఁబోసికొనుటకై తల్లిచెంతఁ జేరి నది. తల్లితోఁ దనమనసు విప్పి చెప్పుకొనినది.

'కాంచక కాంచక కాంచితిఁ బతిని
గాంచితినే కాని కలలోని వార్త
కదనరంగమునకుఁ గదలుచున్నాఁడు
చిరవియోగము మాకు సిద్ధించు నొకో-
అడవిఁ గాసినవెన్నె లాయెను బ్రతుకు
తల్లిరో! నే నెట్లు తాళఁగలాను
బాలునిఁ బోకుండఁ బట్టుట యెట్లు
దరి యేమి నా కని'

తల్లడ మందసాఁగినది. తల్లి రేఖాంబ తనయకుఁ గర్తవ్య ముపదేశించిన యీ ఘట్ట మాంధ్రులచరిత్రమున ననుప మానము. ఆనాఁ డామె యట్లుపదేశింపకుండిన మాంచా లను నేఁడు మన మింతగా ననుకొనవలసినపని యుండదు.

చరిత్రయే మఱొకతీరున లిఖింపఁబడవలసి యుండెడిది.
రేఖాంబ—

'ముద్దులమాంచాల ముదమున వినుము
జన్మవృక్షమునకుఁ జవి గలయట్టి
పటుతరకమనీయఫలములు రెండు
కెరలుభోగము లొండు కీర్తి రెండవది
తొలుపండు చవి చూచి తొలఁగు నొకండు
మలుపండు చవి చూచి మలఁగు నొకండు
వీర లిద్దఱికిని భేదంబు హెచ్చు
మొదటిఫలంబున మొనసెడురసము
క్షణభంగురం బది సమసి పోఁగలదు
రెండవఫలమున రెక్కొనురసము
శాశ్వతం బౌను దిశల్ గలదాఁక'

కావున -

నీవు భోగములపై నిరతిఁ ద్యజించి
బాలచంద్రుని భద్రభావం బెఱింగి
భావిమానవుల హృద్భవనంబులందుఁ
బావకీనయశోలతావివర్ధనము
సేయంగఁ గోరుము చెలువరో! యిపుడు
బాలచంద్రుని నాఁగఁ బట్టంగ వలదు'

అని బోధించినది. మాంచాలహృదయములోఁ గర్తవ్యము మేలుకొనినది. భోగవాంఛయొక్క పొంగు అడగాటి పోయి

నది. హృదయము కలఁక దేఱినది. కర్తవ్యోద్బోధముతో, నిశ్చితహృదయముతో నామె మగనియెదుటి కేతెంచినది.

బాలచంద్రుఁ డతిలోకసౌందర్యవతి యయిన తనసతి మాంచాలను జూచి గతమునకుఁ బశ్చాత్తప్తుఁ డయినాఁడు. మాంచాల యతనికి దగ్గఱగాఁ గూర్చుండినది. బాల చంద్రుఁడు మోహపరవశుఁ డైనాఁడు. ఆమె చీరచెంగు నొడిసి పట్టినాఁడు. అయ్యో! ఆచీరపై నున్నముత్యాల చేరులు మొదటికిఁ దెగి యందలిముత్యములు చెదరి నేల రాలినవి! మాంచాల చిన్నబోయినది. ఆమెమనసున నెందు లకో చివుక్కు మనినది. చెదరి నేల రాలినముత్యములు తనకుఁ గర్తవ్య ముపదేశించుచున్నవిలాలె నున్నవి! బాల చంద్రునికి మాంచాల హృదయములోని సాగరమథనము తెలియదు. ఆమె కట్టుకొనినచీర మడుపు నలఁగిపోయినందు లకుఁ జిన్నబుచ్చుకొన్నది కాఁబోలు నని యతఁడు తలఁచి నాఁడు. అంతకంటె నింకను బొంకముగాఁ జీరను సింగా రింతు నని తలచినాఁడు. మాంచాలచెక్కు నిమిరి, చెదరి నేల రాలినముత్తెముల నేరి, హారముల చిక్కు సడల్చి, యందు ముత్యములఁ గూర్చుచుండినాఁడు. ఇంతలోఁ బుణ్యకాలము దాఁటిపోయినది. బాలచంద్రుని తమ్ములు సెప్పిపోయినయేడు జాముల మితి గడచి పోయినది. మాంచాల మగనిఁ జూచి

"నాతోఁ బెనంగిన నయ మేమి లేదు
కడువడిఁ గలనికిఁ గదలుఁడి మీరు

కులవైరముం దీర్చుగురుసాహసుండు
పరికించి చూడ నెవ్వరు మీరు దక్క''

అని కర్తవ్యోద్బోధము చేసినది.

ఇంతలో బాలచంద్రుని యనుజులు రానే వచ్చినారు. వచ్చి యూరకుండ లేదు. పెల్లుగా గోల చేసిరి. బాలుఁడది యే మని మాంచాల నడగినాఁడు. ''మేడపి చెన్నుని మేలైనసేవ'' యని మాంచాల ప్రత్యుత్తర మొసఁగినది. బాలచంద్రుఁ డామాట వినిపించుకొన లేదు. వినిపించుకొను స్థితిలోఁ గూడ నాతఁ డిప్పు డున్నట్లు లేఁడు. ముత్తైములఁ గూర్చుచునే యుండినాఁడు. తమ్ము లతనికంటె నొక్క యాకు నెక్కువగనే చదివినవారు. 'పురము తల్లడ మంద భూభ్రమల్ కదల' వారు పెడబొబ్బలు పెట్ట సాఁగినారు. బాలుని కది దుస్సహముగాఁ దోఁచినది. ఇఁక సహింపఁ జాలక వారికి గట్టిగా బుద్ధి సెప్పఁ దలఁచినాఁడు. ఓడకోడకుఁ డని యువిదలకు ధైర్యము గొలిపి కటారి పెఱికి యనుజుల మీఁద నట్టహాసము చేసినాఁడు. అనుజు లంతకన్న గడుసు వారు.

'అన్న మెట్టులు లోని కరుగును నీకుఁ
గంటికి నిదుర యేగతి వచ్చు నయ్య!
బంటుతనంబును బాడియు విడిచి
కులవైరముం దీర్చుకోరిక వదలి
యింతి కాసించుట యేనీతి యగును'

అని బాలునిఁ దూలనాడినారు. 'నీవు రాకున్న మానె, మ
మ్మాయినను బంపుము. 'కులపగ తీర్చి నీకుఁ గీర్తి తెచ్చెద'
మనినారు. బాలచంద్రుఁడు సిగ్గుచేఁ జిదికి పోయినాఁడు.
కాని మనసు మాంచాలవైపునకు లాగుచున్నది. ప్రబల
వాంఛ బలవంతపెట్టినది. మనసును ద్రొక్కి పట్టలేక పోయి
నాఁడు. కోరిక పరవళ్లు ద్రొక్కుచున్నది. కాదనలేక
పోయినాఁడు. మాటు మాటాడక మాంచాలమందిరమార్గము
పట్టినాఁడు. మాంచాల మగనిరాకఁడ గ్రహించినది. వాకిటికి
నెదురేఁగి వచ్చినది. బాలుఁడు తనచేతికత్తిని మాంచాల
చేతి కిచ్చినాఁడు. మాంచాల కత్తి చేతఁ దీసికొని నవ్వుచు
మగని నాశీర్వదించినది.

'రతిరాజసుందరా! రణరంగధీర!
కమలబాంధవతేజ! కరుణాలవాల!
వినతాత్మజుని లావు వెస నీకుఁ గలుగు
సామిరి కుండినసాహసం బబ్బు
కృష్ణుని కీడుగాఁ గీర్తి ఘటిల్లు
రవికాంతియుతుఁడ వై రంజిల్లుచుండి
అలరాజుపగ దీర్చి మనుజులతోడఁ
బటుతరవిక్రమవైభవం బలర
శ్రీగిరిలింగంబు చెన్న కేశవుఁడు
వరము లొసంగంగ వర్తిల్లఁ గలరు
శాత్రవవిజయంబు సమకూరు మీకు
నీయాయుధము వడి నిచ్చును జయము
కలియుగంబున మీకు ఘనపూజ లమరు'—

ఖడ్గము మగనిచేతి కందించినది. తనకర్తవ్యము నెఱవేర్చినది. కాని యీమె నొక్కవిషయము మాత్రముబాధించుచున్నది. అనపోతు బ్రాహ్మణుఁడు. అతఁడు కూడ యుద్ధమునకు సిద్ధపడుచున్నాఁడు. అతని నెవ్వరును గాదనలేరు. వలదని వారింపలేరు. యుద్ధరంగములో నతఁడు మరణించిన నాబ్రహ్మహత్యాదోషము తనమగనికిఁ దగులును. ఆ బ్రహ్మహత్యపాపమును

'పరమేశ్వరుం డైనపార్వతీజాని
పాపికొనఁగ లేక పలుపాట్లఁ బడియె'

ఇఁక మనుజు లెంతటివారు. కావున

'కలహంబునకు మీరు గదలుచున్నారు
జయ మపజయము నీశ్వరునకుఁ దెలియు
విప్రుఁ డాయనపోతు వెంట రాఁ దలఁచు
బ్రహ్మహత్య ఘటిల్లుఁ బాపము వచ్చు
మగుడంగఁ బంపుము మాయచే నైన'

నని మగని హెచ్చరించినది. బాలచంద్రునికిని నది యథార్థమనియే తోఁచినది. సరి యని సమ్మతించినాఁడు. మాంచాల తొలిసారిగాఁ గోరినకోరిక యది! అదే కడసారి కోరిక కూడ! మాంచాల తనకు మడిమాన్యము లిమ్మని యడుగ లేదు. నగలు, నాణ్యములు చేయించి పెట్టు మని చెవి కొఱుక లేదు. మగని నింటనే యుండు మని మారాము సేయలేదు. అనపోతు మరణించిన మగనికి బ్రహ్మహత్య

ఘటిల్లు ననియతని నెటులైన మాయచే వెనుకకుఁ బంపు మనినది. చేతులారఁ దనసుఖము చెడనాడుకొని, చెడనికీర్తి ఫలము నాశించి, ఖడ్గము నందించి 'కులపగ' దీర్చుటకై మగనిఁ గదనభూమికిఁ బంపినది. మాంచాల యెంతటి త్యాగమూర్తి!

సీ. 'చతురంతధారుణీచక్రంబు శాసించు
వీరప్రతాపు లీవేళ లేరు
పరవీర్యలుంటూక బాహాబలప్రౌఢి
గలబాలచంద్రు లీగడియ లేరు
ఖడ్గంబు నందిచ్చి కదనభూమికి నాథు
నడపుమాంచాల లీనాఁడు లేరు
కండల న్గదలించుకైత లామెత లిచ్చు
తిక్కనయజ్ఞ లీదినము లేరు

గీ. లేరు పండితలోకావలేపజలద
మండలీచండవాయువుల్ మల్లినాథు
లూచవోయినసంతాన మేచునట్లు
దీవన ల్గురియింపవే తెలుఁగుతల్లి!'

[రాష్ట్రిగానము]

దమయంతి పెండ్లి

నాటకములో నొకేపాత్రమును దీసికొని యిద్దఱు వ్యక్తులు నటించుచున్నపుడు వారిలోఁ బ్రతిభావంతుఁడైన వానినటన తక్కినరెండవవాని నటనకన్న బాగుగా నున్నదని మనకుఁ దోఁపక పోదు. ఒకరత్నమును జేతిలోఁ బెట్టుకొని చూచినప్పుడు దాని కున్నయందము వేఱు. అదే బంగారమునఁ బొదిగి యొక యాభరణముగా రూపొందినప్పుడు దాని కున్నయందము వేఱు. రత్నమువిలువ, రత్నము-రెండును నప్పుడును నిప్పుడును గూడ నొకటే యయినను బంగారములోఁ బొదిగినప్పుడు దాని కొక క్రొత్తసౌందర్యము చేకూరుచున్నది. అట్టిదే కవిత్వవిషయము కూడ. ఒకే కథావస్తువును బరిగ్రహించినను నాయాకవు లాకథకమర్చిన నేపథ్యమువలన దానికిఁ బ్రత్యేక మయినసొగసులు సిద్ధించుచున్నవి. ఆ నేపథ్యములో దానికిఁ గలశక్తి చాల నద్భుత మయినది. ఆ నేపథ్యము నమర్చుటలోనే కవి యుపజ్ఞ, లోకజ్ఞత యనునవి వెల్లడి యగుచున్నవి. నేపథ్య మనఁగాఁ గథకుఁ గావలసిన 'హంగు' అన్నమాట! అది రత్నసౌందర్యము నినుమడింపఁ జేయుబంగారమువంటిది!

తెలుఁగుకవులు చాలమంది సాధారణముగాఁ బురాణ కథలనే తీసికొని కావ్యములు, ప్రబంధములు మొదలగు వానిని రచించినను జక్కనినేపథ్యము నమర్చి వానికిఁ దెనుఁగుతనముఁ, దెనుఁగువేషముఁ, దెనుఁగు వాతావర

ణము గల్పించినారు. నలదమయంతులకథ మహాభారతము లోనిది. భారతములోని నలకథకు శృంగారనైషధములో శ్రీనాథుడమర్చిననేపథ్యము చాల గొప్పది. భారతములో నల్ప ముగా మాత్రమేయున్న నలకథ నొక కావ్యముగా రూపొందించుటలో శ్రీనాథుడాకథకు బురాణత్వమును బరిహరించి కావ్యత్వమును గల్పించుచు నందులో నంతటను దెనుగుతనమును బ్రస్ఫుటింపజేసినాడు. దమయంతి యొక్కడో విదర్భదేశములోని పడుచుగాడు గాక యిక్కడడు దెలుగు ఆడుబిడ్డగా నయినది. ముఖ్యముగా దమయంతి పెండ్లి వేడుకలు, బువ్వముబంతి మొదలయిన సందర్భములలో శ్రీనాథుడమర్చినవాతావరణము చాల విశిష్టమయినది భారతములో దమయంతి స్వయంవరములో నలుని వరించి యతని కంఠమున బూలమాల వేసినతర్వాత నలుడు 'అపూర్వస్వయంవరలబ్ధయైనదమయంతి నత్యంతవిలాసంబుతో వివాహం' బయినట్లు మాత్రమే యున్నది. ఇట్లొక్కమాటలోనే జెప్పబడిన దమయంతిపెండ్లిని శ్రీనాథుడు తెలుగుపెండ్లిగా వర్ణించుట చాల గొప్పవిషయము. తెలుగువారి యిండ్లలో జరుగు పెండ్లి సాంగెములను, పెండ్లిముచ్చటలను నెన్నో సందర్భములలో స్వయముగా జూచినవాడగుటచేత శ్రీనాథుడు తన కావిషయమున గలలోకజ్ఞత నంతను బ్రదర్శించి దమయంతీవివాహాఘట్టమున కొక వినూత్న సౌందర్యమును దీసికొని వచ్చినాడు.

పెండ్లినాడు పెండ్లికుమార్తె యయినదమయంతికి జరగినయలంకరణవిధాన మంతయు సంపన్న లయిన

తెలుఁగువారి యిండ్లలో జరుగుపద్ధతిగానే యున్నది. ఆనాఁ డామెకుఁ దల యంటి నీరు పోసిరి.

గీ. 'కువలయాక్షులు ముత్యాలచవికెలోన
జలక మార్చిరి నిజకులాచారసరణిఁ
బసిఁడిపీఠంబుపై నుంచి పద్మనయనఁ
జెలువ మగుగన్నె రాకమ్మునఁ జేతి కిచ్చి'—

క్షత్రియుల యిండ్లలో వివాహసమయములలోఁ బెండ్లి కుమార్తెచేతిలో నొకబాణము నుంచి మంగళస్నానముఁ జేయించుట సంప్రదాయము. ఆ యాచారమే దమయంతి పెండ్లి సందర్భములోను బాటింపఁ బడినట్లు వర్ణించినాఁడు శ్రీనాథుఁడు. ఆ తరువాత దమయంతి ధరించిన సొమ్ము లన్నియుఁ దెలుఁగుసొమ్ములు. కాళ్లకు శుభముగాఁ బారాణి పూసి, దమయంతికి సాంగోపాంగముగా ముత్యాలజల్లి, చెందిరపుఁ జేర్చుక్కఁ, చిన్నిపూఁజేకులు, పాలికలు, కంకణములు, మట్టియలు, వీరమద్దియలు, పాయవట్టములు మొదలయిన సొమ్ములు పెట్టి చెలిక త్తెలు పెండ్లిశృంగారముఁ జేసిరి. ఇవన్నియుఁ గూడఁ దెలుఁగువారి సొమ్ములు. ఇవి యన్నియుఁ బెట్టుకొనినదమయంతి తెలుఁగు ఆడుబిడ్డ కాక మఱేమగును? అలంకరణ మయినతరువాత దమయంతి 'బ్రాహ్మణముత్తైదువు'లకుఁ జందనతాంబూలాదు లిచ్చి సత్కరించినది. ఇది కూడఁ దెలుఁగుకుటుంబములలో జరుగు నాచారమే! ఇదే సుమంగలీపూజ.

నలుఁడు విడిదియింటినుండి పెండ్లికుమార్తెయింటికి బయలుదేరినాఁడు. పెండ్లియిల్లంతయుఁ దెలుఁగువారి పద్ధతిలోనే యలంకరింపఁబడి యున్నది. వియ్యాలవారు వరునికి స్వాగతము చెప్పి తీసికొని పోవుటకై 'ఎదురుకోలు' నడచి వచ్చినారు. దమయంతికి సోదరుఁడయినదమ్ముఁడు కాలినడకతోనే యెదురు వచ్చి నలమహారాజును సకలవిధము లయినమర్యాదలతోఁ బెండ్లిమండపముకడకుఁ దీసికొని పోయినాఁడు. వివాహమంతయు యథావిధిగా జరగినది. మధుపర్కము, కంకణబంధనము, పాణిగ్రహణము నను వైదికకార్యములు బాగుగానే జరగినవి. ఆ తరువాత మామగారల్లునికి వస్తువాహనము లన్నియు నిచ్చి సత్కరించినారు. సప్తపది, కొంగుముడులు వేయుట, ధ్రువారుంధతీ దర్శనము, మహదాశీర్వచనము, తరువాత లాజహోమము, పునస్సంధానము సక్రమముగా జరగినవి.

తరువాతఁ బెండ్లికి వచ్చినచుట్టముల కందఱకు దమ్ముఁడు, దమనుఁడు-నిద్దఱు భోజనములకై యేర్పాటులు చేసిరి. ఈ బువ్వముబంతి యచ్చముగాఁ దెలుఁగువారి యిండ్లలో జరగుబువ్వముబంతియే యనుటకు సందేహము లేదు. వరుసలు కలిసినవారు, బంధువులు నీ బువ్వముబంతి సందర్భములోఁ జేసికొనుసరసములు, వేళాకోళములు, వెక్కిరింతలుఁ జాల సహజముగను, మనోహరముగను నిందులో వర్ణింపఁబడినవి. భోజనములకు ముం దందఱు భోజనములకై యెట్లు సిద్ధపడుచున్నారో చూడుఁడు.

సీ. పట్టాంశుకములపై బన్నీరు ప్రోక్షించి
చేయార్చి చేపట్టు సేయువారు
మక్కళించినతావు మంజిళ్ల పెందెర
లుంగరంబులఁ బట్టి యొత్తువారు
నగరుధూపము వెట్టి యభ్యంతరం బైన
గగనావకాశంబుఁ బొగపువారు
వెండి యెడ్డెనలపై వెలచి తెచ్చినపైఁడి
పళ్లెంబు లాయత్తపఱుచువారు

గీ. రంకుమృగరోమకృతనూత్నరత్నకంబ
ళాది నానావిధాభ్యర్హా తాసనములు
పెట్టువాడును నై రిందుబింబవదన
లుభయబాంధవభోజనోద్యోగ వేళ—

తెలుఁగువారి యిండ్లలోఁ బెండ్లిభోజనము లిట్లేకదా జరుగును? ఈ సందర్భములోఁ జుట్టములు వేళాకోళము లని మాటలాడువాటలకును, జేసెడు చేష్టలకును నంతు లేదు. ఎవరి నయితే వేళాకోళము పట్టింతురో యాతఁడు కూడ నా వేళాకోళమునకు నేమియు నొప్పి చెందఁడు సరికదా యా పరిహాసమును దానును సంతోషముతో స్వీకరించుటలోనే యున్నది చమత్కార మంతయును.

పెండ్లికొడుకు నలమహారాజు భోజనము చేయుచుండి నాఁడు. ఒకావిడ యాయనకు విసనకఱ్ఱతో విసరుచుండినది. అప్పు డింకొకతె యేమి చేసినదో తెలియునా? ఒకముసలి యాసరవెల్లిని దీసికొని వచ్చి పాపము! ఆవిడ కాళ్లదగ్గఱ

వదలినది. అది తన శరీరముమీఁది కెగఁబ్రాకుసరికి బెంబే
లెత్తి పోయి యావిడ యావిసనకట్ట నక్కడఁ బడవైచి
పఱుగు పుచ్చుకొనినది. ఆవిడను జూచి యప్పు డచ్చటివా
రందఱును గడుపు చెక్కఁ లగునట్లుగా నవ్వుకొని రఁట!

ఇంకొక్క ముచ్చట. వడ్డన జరగుచుండినది. అంద
ఱును భోజనములు చేయుచుండిరి. భోజనము సేయుచుండిన
యొకాయనకు దాహము వేసినది. ఆ సందర్భములోని పద్య
మును జూడుఁడు.

గీ. ఓమె యేమె యిదేమేమె లేమ యేమె
మేఘపుష్పంబుఁ దే వంచు మేల మాడ
మేమె మేమెలు తఱు చయ్యె మేలు మేలు
మేక మేఁ కన సభవారు మిగుల నగిరి.

మేఘపుష్ప మనఁగా జలము. దాహముతో నాయన
'ఓమె యేమె యిదేమేమె లేమ యేమె, మేఘపుష్పంబుఁ
దేవు' అని దాహ మప్పుడు సహజ మయినతబ్బిబ్బుతో
నడుగఁగా నాయనను వేళాకోళము పట్టించి పరిహాసము
చేసిన దావడ్డన చేయుచుండినదొడ్డ యిల్లాలు! 'ఏమయ్యా!
మే మే మే అని యఱచుచున్నావు? నీ వేమి మేఁకవా
యేమి?' అన్నది. అందఱును గొల్లు మనిరి.

మఱొక్క వేడుక. పాప మొక్కకోమటి యక్కడికి
భోజనమునకు వచ్చినాఁడు. ఆయన పెండ్లికుమారుని కోశాధి
కారి కూడ. చాల నమాయకుఁడు. ఆయన కూర్చుండుచోటఁ
గొంకుపిల్లలు కొందఱు పెద్దపులితోలు నాసనముగా వేసి

నాఁడు. వా రెందు కట్లు వేసినారో తెలియక యాయన సరాసరి వెళ్లి దానిమ్మాఁదఁ గూర్చుండినాఁడు. ఆపులితోలు తోఁక యాయనకుఁ బురోభాగమునవచ్చి యుండినది. ఆయన బాగుగా నాసీనుఁ డగువఱకు నూరకొని యా తరువాత 'సెటి గారు కోశాధికారి గదా! ఆయన కోశము ముందుంచుకొని కూర్చుండినాఁడు. చూడుం డయ్యా?' యని యా కొంటె పిల్ల లనుసరికి నందఱు గొల్లు మని నవ్విరి. పాపము! సెట్టి సాధువు. వారి నేమియు ననలేక కిక్కు-రు మనకుండ నూర కుండినాఁడు.

ఇంక నక్క-డి పెండ్లిభోజన మంతయుఁ దెలుఁగు భోజనమే. పెండ్లినాఁ డేయేపిండివంటలు చేసిరో యాక్రింది పద్యముఁ జూడుఁడు. అందులో నన్నియు మనకుఁ దెలిసిన, మనము తిన్న పిండివంటలే యన్న సంగతి స్పష్టము కాఁగలదు.

సీ. గోధూమసేవికాగుచ్ఛంబు లల్లార్చి
ఖండశర్క-రలతోఁ గలిపి కలిపి
గుజ్జుగాఁ గాచినగోక్షీరపూరంబు
జమలిమండెగలపైఁ జల్లి చల్లి
మిరియంబుతోఁ గూడ మేళవించినతేనె
దోరంపులడ్డూలు దోఁచి తోఁచి
పలుచగా వండినవలిపెంపుఁజాపట్లు
పెసరపప్పులతోడఁ బెనచి పెనచి

గీ. గోవ జవ్వాదిఁ గస్తూరిఁ గొఱఁతపఱుచు
వెన్నపడిదంబు జొబ్బిల విఱిచి విఱిచి

వారయాత్రికు లనుమోదవంతు లగుచు
వలచి భుజియించి రొగిఁ బిండివంటకములు.

వడ్డనలలోఁ జాలఁ జిక్కు లున్నవి. అందఱికి నన్ని పదార్థములు నందక పోయినయెడల వారికిఁ గోపములు వచ్చును! అందుచేత నెట్టిలోపమును రానీయకుండఁ జూచుట పెండ్లి పెద్దల ధర్మము.

గీ. పచ్చతొనమూనికంబుల పళ్లెరములఁ
బచ్చగందనికూర లేర్పడమిఁ జూచి
పెట్ట రని పెండ్లి పెద్దలు పెడము వెట్టఁ
బెట్టుటకు నంగనలకును బట్టఁ దడవు.

పచ్చతొలిచికంచములలోఁ గూరలు వడ్డించిరి. కాని యూరంగులలోఁ గూరల రంగులును గలసి పోయినవి! అందు చేతఁ దమకంచములలోఁ గూరలు పెట్టలే దేమండ్రా యని కొందఱు కారాలు మిరియాలు నూరుట ప్రారంభింపఁగా వడ్డించుచుండినయమ్మలకు లెవరి కేమి కోపములు వచ్చునో యనియు, నెవరి కేమి యందలేదో యనియు భయపడి వడ్డన యొకంతకుఁ దెమల్పకుండ వడ్డించుచునే యుండినారు. అందు చేత వడ్డనకుఁ జాలసేపు పట్టిన దఁట! ఇది మన పెండ్లిం డ్లలోఁ గొందఱు భోజనములకు ముందు చేయు నానాహంగా మాలను దెలుపుచు సందర్భోచితవర్ణనముగా నున్నది.

చక్కనిపద్య మిది చూడుఁడు.

గీ. మిసిమి గలపుల్ల పెరుఁగుతో మిళిత మైన
యావపచ్చళ్లు చవి చూచి రాదరమునఁ

జుట్టు మని మూర్ధములు దాఁకి యొట్టి దనముఁ
బొగలు వెడలింప నాసికాపుటములందు.

పుల్ల పెరుఁగు కలిపినయన్నమునకు నావకాయ నంజు
కొన్నారఁట! కారము నసాళ మంటి ముక్కు-రంధ్రములలోఁ
బొగలు సెగలు వచ్చిన వఁట! స్పష్టముగా నిది యాంధ్రుల
యభిమానవ్యంజన మయినయావకాయను దెలుపుచున్న
దనుటలో సందేహము లేదు.

పెరుఁగన్నము భోజనము చేసినతరువాత నందఱు
నరఁటిపండ్లు తినుచుండిరి. ఒకాయన తానును దిందు నని
విస్తటిలోనుండి తీసికొని నోటఁ బెట్టుకొనఁ బోవుచుండఁగా
నాయనబావ యూరకొనక 'భావదుష్ట మోయి బావా!'
యని యతనిని జూచి నవ్వినాఁడు. అది యర్థము చేసికొనిన
యాతని భావమఱఁది బావగారివై పట్లన్నందులకుఁ గొఱ
కొఱ చూచుచు దానిని దినుట మాని విస్తటిలో నొక
ప్రక్కకు నెట్టినాఁడు!

గీ. పంచదారఁ బొరపి భక్షింపఁగా నెత్త
భావదుష్ట మనుచు బావ నగినఁ
దొలఁగఁ బెట్టె రోషకిలకించితంబుతోఁ
గొమ్మనరఁటిపండ్లు గూర్మిమఱఁది'—

అందఱకు భోజనము లయినవి. చేతులు కడుగుకొని
నారు. అందఱును తాంబూలములు స్వీకరించుచుండినారు.
యువరా జయినదముఁ డూరకుండవచ్చునా? ఊఁహుఁ. బావ
గారిపని పట్టించుట కాయనదగ్గఱి నంతచనవు లేదు కదా

మఱి! ఆయనగారి సేవకుని వేళాకోళము పట్టించిన నాయనను బట్టించినట్లే కాఁగలదు.

చ. కలికివరాటరా జపుడు గప్పురవీడెము వెట్టె నవ్వుచు
న్నలు నడపంబువానికి ఫణాధరవల్లిదళాంతరంబునఁ
బలితపుఁదేలు మైనమునఁ బన్ని యతం డిది చూచిభీతిఁ ద
మ్మల మిల వైచిన న్నగిరి మూఁగినరాజకుమారు
లందఱున్.

అల్లుఁడుగారు, నడపకాఁడుఁ దనప్రక్కనే యుండఁగా దముఁ డొక తమ్మలపాకులో మైనముతోఁ దయారు చేసిన యొక తేలు నుంచి దాని నతనిచేతిలోఁ బెట్టినాఁడు. అతఁ డది నిజముగాఁ దేలే యేమో యనుకొని 'అమ్మో బాబోయ్!' అని యెగిరి యొక్కగంతు వేసి యాతాంబూలమును నేల మీఁదఁ బడవేసినాఁడు. అడపకాని పిఱికితనముఁ జూచి యందఱును గొల్లు మని నవ్విరి.

ఇ ట్టీబువ్వముబంతి ఘట్ట మంతయుఁ గూడఁ దెలుఁగు పెండ్లిండ్లలో సాధారణముగా బావ బావమఱఁదులు, బావామఱదల్లు చేసికొనుసరసములవంటి సరసములతోఁ జాల మనోహరముగా రచింపఁబడినది. దమయంతిపెండ్లి యొక తెలుఁగుపెండ్లి యే యన్నను దప్పు కాదు. అంపకములు కూడ మనపద్ధతిలోనే జరగినవి. దమయంతి నత్తవారింటికిఁ బంపుచు భీముఁడు చేసినహితోపదేశము తెలుఁగుపిల్లలకు వారితల్లులుఁ, దండ్రులు సాధారణముగాఁ జేయునదే! దమయంతిసోదరులు కూడఁ దండ్రియాజ్ఞప్రకారము సరిగా మనలాగుననే కుమార్తె

పసుపుకోసమని నూఱుగ్రామములు వ్రాసియిచ్చినారఁట!
మన మిచ్చుభూము లెకరములలో నుండిన వారిచ్చినవి
గ్రామములలో నున్నవి. అంతే తేడా. సంప్రదాయము
మాత్రము మనదే. అత్తవారింటికిఁ బోవుచెల్లెలికి నాయము
సోదరు లేమేమి యిచ్చి పంపిరో యీపద్యముఁ జూడుఁడు.

ఉ. సంకుమదంబుఁ గస్తురియుఁ జాదు పటీరముఁ గప్పురంబునుం
గుంకుమపువ్వునుం బునుఁగు గొజ్జెఁగనీరు ననేకభారముల్
కంకటకంఠికాకటక కాంచిముఖాభరణవ్రజంబుతోఁ
గొంకక తోడఁబుట్టువులు గూరిమిచెల్లెలి కిచ్చి రిద్దఱున్.

సువాసనద్రవ్యములు, గాజులు మొదలయిన మంగ
ళాభరణములు పెట్టి పంపినారు దమయంతి సోదరులు. మన
యిండ్లలోఁ గూడ సరిగా నిట్టిదే కదా జరగుచున్నది!

నైషధగ్రంథమునకు ననువాదమే యయినను శృంగార
నైషధము కొన్నికొన్నిస్థలములలోఁ దెలుఁగుతనపు జిలుగు
మెఱుఁగులు చిమ్ముచుఁ దెలుఁగుతనమునకుఁ గాణాచిగా
నున్నది. ఇందులో నుపవర్ణిత మయిననలకథ పురాణకథయే
యయినను శ్రీనాథుఁడు తనకావ్యములో దానికనుర్చిన నే
పథ్యమువలన నది యపూర్వముగా సొగసులు దిద్దుకొనినది.
అతఁడమర్చిననేపథ్యమువలన నలకథకుఁ గలిగినపుష్టి
యపూర్వ మయినది!

మాలదాసరి

ఆముక్తమాల్యదయందు రాయలవారు చిత్రించిన పాత్రములలో విష్ణుచిత్తునికన్నను, నాతని కుమార్తె యగు గోదాదేవికన్నను గూఢఁ బాఠకుల హృదయములకు నెక్కు-డు దగ్గఱగా నుండి మెప్పు గొలుపుపాత్రము మాలదాసరి. దానికిఁ గారణము రాయలవారు మాల దాసరిని గృత్రిమవాతావరణమునందుఁ గాక సహజ మయినవాతావరణమునందు సృష్టించి యుండుటయే. అందు చేతనే మాలదాసరిపాత్రము విష్ణుచిత్తగోదాదేవి పాత్రముల వలెఁ బ్రబంధలక్షణములకు లోనైనపాత్రముగాఁ గాక సహజపాత్రముగా భాసించుట. మాలదాసరి పాత్రపోషణ మెంత హృదయంగమముగఁ జేయఁబడినదో పరిశీలించిన యెడల రాయలవారి పాత్రపోషణవిధానమును, మాలదాసరి యెడ వారికిఁ గలప్రత్యేకాభిమానమును వెల్లడి కాఁగలదు. మాలదాసరి యిందు విష్ణుభక్తుఁడుగ, ద్వంద్వయుద్ధచాతురీ ధురీణుఁడుగ, వాదప్రతివాదములయందు బ్రహ్మరాక్షసుని కెందును దీసిపోవనిశాస్త్రవాదదక్షుఁడుగ, శిబిప్రముఖు లయినయుత్తమవదాన్యులకంటె నెక్కు- డగుదేహదానమున కే సిద్ధపడిన మహావదాన్యుఁడుగ, నాడి తప్పనిసత్యవ్రత పరాయణుఁడుగాఁ, గరుణామూర్తిగాఁ జిత్రింపఁబడినాఁడు.

మాలదాసరివేష మిందు మిక్కి-లి సహజముగా నిర్వ హింపఁ బడినది. ఏ వరాహావతార కాలమునకు ముందునాఁడో నివసించినమాలదాసరి యెట్టి వేషమున నుండెనో మన

మెఱుఁగము. కాని రాయల్లవాఁడు చిత్రించినమూలదాసరి రాయలనాఁటి 'సురియాళు వైష్ణవుఁడు'గఁ బాఠకులకు దర్శన మొసఁగుచున్నాఁడు. చము రైనతోల్కుబుసమును, కెక్కియును ధరించి, చెవులయందు నిత్తడి శంఖచక్రకుండలములు మెఱయుచుండఁగ, దివెదారి కొమ్మును తోలు తిత్తిని జోడమ్మును గలిగి, మొగలాకు గొడుగుఁ బట్టుకొని, విష్ణుదేవుని పాదుకయుఁ, దిపిరిదండెయును ధరించి, చంకకుఁ గట్టుకొని యుండినపుటికకుఁ జిటితాళములు దగిలి గతిరయమున మెరయుచుండఁగా పసమాలను, బట్టెతిరుమన్నును, బసపుపొడి తోలువల్లమును దాల్చి యాతఁడు విష్ణుదేవుని సేవింప వచ్చుచుండె నఁట! ఈ పద్యముఁ జూడుము.

సీ. చము రైనతోల్కుబుసంబు కెక్కియును ని
త్తడి శంఖచక్రకుండలము లమర
దివెదారికొమ్ముఁ దో లి త్తియు జోడమ్మ
మెడమీఁది మొగలాకుగొడుగుఁ దనర
మత్పాదరక్షయు మావుపెన్వోఅకఁ గు
ట్టినయోటితిపిరిదండెయును మెఱయఁ
జిటితాళములు సంకపుటిక నొక్కొకమాటు
గతిరయంబునఁ దాఁకి కలసి మెరయ

గీ. వలుదవనమాల కంఠంబు మలిసతనువు
బట్టెతిరుమన్ను బెడరుఁగెంబుట్టుఁజూపు
బసపుఁబొడి తోలువల్లంబు నెసక మెసఁగ
వచ్చు సేవింప సురియాళువైష్ణవుండు.

ఇందు మనకు మాలదాసరి వేషము ప్రవ్యక్తముగాఁ దెలియవచ్చుచున్నది.

మాలదాసరి వామనావతారమున విష్ణుదేవుఁడు నివసించు చుండిన 'కురుంగుడి'కి మూఁడుయోజనముల దూరమున నొక పక్కణమునందు నివసించుచుండినవాఁడు. అతఁడు 'పేరు కొనఁగానికులమునకుఁ' జెందినవాఁడయినను గొప్ప విష్ణు భక్తుఁడై తనరారుచుండెను. ప్రతిదినమును నతఁడు బ్రాహ్మ వేళయందే లేచి కురుంగుడికిఁ బయనమై పోయి యచ్చటి వెన్నుని మంగళనామకై శికీరాగమునఁ గీర్తించుచుండెడి వాఁడు. అతఁడు మహాత్ముఁడు. అందుచేతనే యాతఁడు భగవ త్ప్రీతికై జాత్యుచితచరిత్రమునే పూనినను, నాతని హృద యముమాత్రము శుచితానిత్యముగ నుండెను. అది యెట్లుండె ననఁగా మసిపాఁతలో మానిక మొదిగినట్లుండెను. బ్రాహ్మ వేళల లేచిపోయినమాలదాసరి కురుంగుడి చేరి యచటి దేవాలయమునకు సమీపమునఁ దనయొడలిమీఁది వ్రేఁగులు డించి యుత్పలకుఁ డై చాండాలికను మీటుచు గుండులు నీ రగునట్లు నుతులు పాడును. భక్తిజనితోద్యత్తాండవం బాడును. అపరాహ్ణ మగుదాఁక నెండగాలిపసితాకుఁ జూడక యట్లు పాడి పాడి సాష్టాంగముగ వెన్ననికి నమస్కరించి యా పిదప 'గర్భమంటపి కడిగినకలఁక జలము లోని బ్రాతొట్టి లి నిండి కాలువగఁ జాగి గుడి వెడలి వచ్చునది శూద్రుఁ డిడఁగఁ గ్రోలును'. అగ్రవర్ణములవారియెడ నాతనికి గౌర వము మెండు. ముఖ్యజాతిఁ గనినంతనే యాతఁడు దూర

మునకుఁ బొలఁగిపోయెడివాఁడు. ఎండ యనక గాలి యనక యెంతో తడవు ప్రసాదవినియోగ మగుదాఁక వేచియుండి యా పిదపఁ ద్రివర్ణేతరజాతి దయతో నిడ్డప్రసాదమును దండె సాచి శ్రద్ధాతిశయమున వినతి నందికొనును. దానిని భుజించి వాఁ యెసఁగినజలమును గ్రోలి యాతఁడు గుడిలాపరాతూపరాణి కడనే నిలిచి యుండి–గుడిలోనికిఁ బోవుటకు వీలులేదు కనుక– బహిరావరణప్రదక్షిణము మాత్రము చేసి ప్రొద్దెక్కినపిదప నిజపక్కణమునకుఁ బోవును. ఇది మాలదాసరి దినచర్యా ప్రకారము.

మాలదాసరి 'పోరిలో వాఁడిమిఁ గొంతకాల మిల్ప్రాలినవాఁడు'. లావరియుఁ గూడ. రేవగటివేళకు మానిసి యఁట యాతఁడు! అందుచేతనే యాతఁడు బ్రహ్మరాక్షసు నంతవానిని గొంతదాఁక నైన నిగ్రహింపఁ గలిగినాఁడు.

మాలదాసరి యొకనాఁ డద్దమ రేయియందే కోడి కూఁత విని చనుప్రొద్దాయె నని కురుంగుడికిఁ బయన మయ్యెను. కటికచీఁకటిలో దారి తప్పి యాతఁడు కాడుపడి యడవు లెల్లఁ దిరిగి తిరిగి తూరుపు తెల్ల నగుసరి కొకశూన్య గహనవాటిని ప్రవేశించెను. అచట పాడఱినసీమలఁ బోవుచుఁ, బల్లేరుల నూడ్చుచుఁ బోయి పోయి యాతఁ డొక చోనొక వటవృక్షమును గాంచెను. అచట నా వృక్షముపై రాక్షసుఁడు చూపినయింద్రజాలములను గాంచి నరుఁడు కాని వాఁ డెవఁడో యం దున్నాఁ డని యాతఁడు సంశయించు చుండఁగ నా చెట్టుమీఁదినుండి యొక బ్రహ్మరాక్షసుఁడు క్రిందికి దూకి యాతనియెదుట నిలిచెను. మాలదాసరియు

లావరి యగుటచే బెగడొందక నిలిచి యాతనిని దనవాఁడి శరముచే నడిచెను. బ్రహ్మరాక్షసుఁడు దానిని ద్రుంచి వైచెను. అంత వా రిరువురికిని గొంతసేపు ద్వంద్వయుద్ధము జరగినది. ఈ పద్యముఁ జూడుడు.

సీ. తిగిచిన నడుగులు దెమలక ఱో మ్మప్ప
ళించి యవ్వలికిఁ జండించి దాఁటి
చఱచిన వంచించి చరమభాగములకై
తిరిగి తత్క్రియ కగుదృష్టి నిలిపి
పైఁబడ్డఁ జనుమరపట్ల కొడ్డుచు నుండు
పిడికిళ్ళబలిమి లోఁబడక నిలిచి
చొరఁ జూడఁ గ్రుంగి ముష్టులబిగి కోటగాఁ
జొర వీక తిరిగెడుచోన తిరిగి

తే. యసుర వధసాధనము రోయునపుడు గ్రుద్ది
తాచి తిరిగినఁ గృతముష్టి దండ నిలిచి
యెడకొలఁది వెనుక నడు మొయ్య నడచి యడచి
మత్పదస్మృతి నాత్మ నేమఱక యతఁడు.

మాలదాసరి బ్రహ్మరాక్షసునివలెఁ గాక 'విష్ణుపద స్మృతి నాత్మ నేమఱక' బ్రహ్మరాక్షసునితోఁ బెనఁగులాడి నాఁడు. దీనినిబట్టి మాలదాసరి యాత్మబలమునకుఁ దోడుగ దైవస్మరణచే దైవబలమును గూడ వాంఛించె నని తెలియు చున్నది. అందుచేతనే మాలదాసరి ద్విగుణీకృత మైనబల ముతో బ్రహ్మరాక్షసునిఁ దాచి పోఁ జూచినాఁడు. కాని బ్రహ్మరాక్షసుఁడు తన రాక్షసీచయము నెల్లఁ జేరి వా రేఁగు

దేరఁగ 'పోయె నదెవాఁడు రారెరారే' యటంచుఁ బాఱి వారును దానును బట్టుకొనెను. పట్టువడిన పిదపఁ గూడ మాలదాసరి పెనఁగులాట మాన్పలేదు. 'పదహస్తులను, గపోణిపోటులను' బొడుచుచు నాతఁడు బ్రహ్మరాక్షసునితోఁ బెనఁగినాఁడు. బ్రహ్మరాక్షసుఁడును మాలదాసరి నెట్లో బహుప్రయత్నముమీఁద వటవృక్షమునకుఁ జేర్చి కట్టి యసియుఁ బాఱియుఁ దేఁ బంచి యాంత్రవల్లిని గోలగగ్గెర వైచెను. పాపము! మాలదాసరి 'యక్కజముతోడ నొర గక తప్పినది కాదు.' మాలదాసరి పెనఁగులాట కంతకును నాత్మరక్షణము కాదు ప్రధానకారణము. మఱి యెప్పటి వలెనే వేళకుఁ గుఱుంగుడికిఁ బోయి యచట భగవత్సం కీర్తనము గావించుటయే. అందుకే యాతఁడు ద్వంద్వయుద్ధ సమయమునఁ గూడ విష్ణుపదస్మృతి నాత్మ నేఁజఱ లేదు. ఇట్లీఘట్టమున నాతని ద్వంద్వయుద్ధచాతురి భగవద్భక్తితో మిళిత మై మనోహరముగా నున్నది.

మాలదాసరి బ్రహ్మరాక్షసునికిఁ బట్టువడినపిదప నాతఁడు బ్రహ్మరాక్షసునితోఁ నెఱపిన చతురసంభాషణము వలన నాతని వాదపటిమ వెల్లడి యగుచున్నది. మాలదాసరి యంతగాఁ జదువుకొనినవాఁడు కాఁడు. ఆతని పరిసరములును నాతని కంత సంస్కారమును గలుగఁజేయునట్టివి కావు. కాని మాలదాసరి బ్రహ్మరాక్షసునితోడ సంభాషించిన పట్టున నాతఁడు ప్రదర్శించిన శాస్త్రజన్యజ్ఞానము నిజముగా వెఱఁగొందఁ జేయఁగలదు. 'కళల్ పదునాల్గు నేర్చిన' బ్రహ్మరాక్షసుఁడు కూడ 'చంపకు చదువుల మేము పఠింపని

శాస్త్రములె మాపఠింపనిశ్రుతులే' యనియు, 'ఎవ్వఁడీ యర్థవాదపుమృషల్ విని బేల్పడు' ననియు మాలదాసరి వైదుష్యమునకు సాక్ష్య మిచ్చినాఁడు. నిజమునకు మాల దాసరి కింత వైదుష్య మెక్కఁడి దని మనకును సందేహము కలుగక మానదు. కాని యాతని యాపాండిత్య మంతయును 'శ్రుతపాండిత్యమే' యనియుఁ, గుఱుంగుడిలోని వైష్ణవ భాగవతుల పరిచయప్రభావమున నాతని కది యబ్బి యుండు ననియు మనము తలఁపవలసి యున్నది. అది యబ్బుటకుఁ గూడ నాతని పూర్వజన్మసంస్కారము కారణము. వేదాదులలోని 'ప్రథమాం పిబతే వహ్నిః' ఇత్యాది వేదవాక్యముల యర్థ మాతనికి బాగుగాఁ దెలియును. ఆ వాక్యములను గూడ నాతఁడు స్వయముగా విని యుండెను. వానిని బేరొక్కనుటకుఁ గూడ నాతనికిఁ దెలియును. కాని 'యేతదర్థంబు మా కుచ్చరింపరా' దని యుచ్చరింపరానిది కనుకనే మానినట్లు బ్రహ్మరాక్షసునితోఁ జెప్పినాఁడు. దీనిమూలమున మాల దాసరికి వేదవాక్యములతోఁ గలపరిచయము ప్రవ్యక్త మగుచున్నది.

బ్రహ్మరాక్షసునిచేఁ జిక్కినపిదప మాలదాసరి యాత నితో సంభాషించినతీ రాతనివాదపటిమకును, శాస్త్రపాండి త్యమునకును జక్కనినిదర్శనము కాఁగలదు. హింసాచరణము వలన మాంసాశనము గావించుట మహాపాప మని యుద్బో ధించుచో బ్రహ్మరాక్షసుఁడు మాలదాసరి తనకడనుండి తప్పించుకొనుటకే యీ వాక్యములను బలుకుచుండె నని తలఁపవచ్చును. తన కట్టియభిప్రాయము లే దనినను నంతకు

మునుపు బ్రహ్మరాక్షసునితో నాతఁడు పెనఁగులాడి యుండు టచే నాతఁడు ప్రాణభయమునఁ జేయట్లు పలికె నని బ్రహ్మ రాక్షసుఁడు తన పలుకులను విశ్వసింపక పోవచ్చును. అందు చేతనే మిక్కిలి మెలఁకువతో మాలదాసరి 'నేను భాజన గతాన్నమను. ఎక్కడికిఁ బోఁగలను? పెనఁగు లాడక ప్రాణరక్షణవిషయమున నుపేక్ష యొనర్చుట పాప మని పెనఁగు లాడితిని గాని నాకు శరీరముమీఁదఁ గాంక్ష లేదు సుమా!' యని బ్రహ్మరాక్షసుఁడు నమ్మఁ బలికినాఁడు. ఇంకను విశ్వసించునో విశ్వసింపఁడో యని 'హీనజన్మ మఱుట, యెవ్వఁడే నొకప్రాణి సంతసిలుట, ముక్తిపొంత గనుట' యనుమూఁడుపున్నెము లొక్కట సిద్ధించుచుండఁగా నాకు శరీరత్యాగమున సందేహ మెందుల కని ప్రశ్నించి నాఁడు. అంతటితో నూరకుండక 'తెవుల్లైనను, గ్రహ మైనను, మఱేం కేడైనను దీర్చుపేలవతను వ్యూరకే చెడక కృశు నొక్కనిఁ బ్రోచు టన్న గొప్పవిషయము కదా! ఇందులకు నేనుమాత్ర మేల వెనుదీయుదు' ననెను. ఈ పలుకులతో బ్రహ్మరాక్షసుని కొకింత విశ్వాసము చేకూర్చి తన్మూలమునఁ గొంతపూర్వరంగ మేర్పఱుచుకొని యా పిదప నాతఁడు బ్రహ్మరాక్షసునికి 'ధర్మ మెఱిఁగించుసూక్తి'ని వినిపించెను. అతఁడు దెల్పినయాహితము తర్కసహ మై బ్రహ్మరాక్షసునికిఁ గూడ మెప్పు గొలిపినది. తనమాట ప్రాణభయంబున నాడుకార్యవశంపుమాటగాఁ దెలియక మాధ్యస్థంబ కాఁ దెలిసి వినుమని, యాతఁడు హింసాచర ణము తగ దని యుద్బోధించుట కుపక్రమించును. ఈ ఘట్ట

మున ' వ్యాఘ్రసింహవరాహవృకజంబుకాది శరీరములయం
దొకఁ-తిర్యక్కఁ-వు కావు!' అని యుపక్రమించి యొక యిటి
కఁ పై మటియొక యిటికఁగఁ బేర్చుచు భవననిర్మాత భవన
మును నిర్మించిన ట్లొకవాక్యమునకు మఱొకవాక్యమునుగాఁ
గార్యకారణసంబంధమున గ్రుచ్చుచుఁ బోయి తనవాద
సౌధము నాతఁడు నిర్మించినాఁడు.

మాలదాసరి విష్ణుభక్తిసంపన్నుఁడు. బ్రహ్మరాక్షు
సునికడనుండి యాతఁడు కుఱుంగుడికిఁ బోవుటకై యాతనిఁ
బ్రార్థించుటలోను, నంతకు మునుపు బ్రహ్మరాక్షసునితో
నాతఁడు పెనఁగులాడుటలోను నాతని ప్రధానోద్దేశము విష్ణు
సంసేవనమే. తన యనుదినవ్రతమున కెట్టి యాటంకమును
గలుగఁ గూడ దని యాతనిపూనిక. అందులకే యాతఁడు
బ్రహ్మరాక్షసు నెట్లో యొడంబఱిచి ' సాప్తపదీన మైనతమ
సఖ్యము నుగ్గడించి '

క. ' ఈ కురుగటి యీ కుఱుగుడి
వైకుంఠునిఁ బాడి వత్తు వ్రతముగఁ దత్సే
వాకృతికడపట నశనము
నీ కౌదు న్మఖ్య మిదియ నేఁ డగుఁ దుదకున్. '

అని ప్రార్థించినాఁడు. బ్రహ్మరాక్షసుఁ డందుల
కంగీకరింపక ' నేఁ జన నీమియున్ మగుడి నీవా రామియుం
దెల్లము ' అని యాతని ప్రార్థనమును దిరస్కరించినాఁడు.
అపుడు మాలదాసరి చెవి మూసికొని నారాయణస్మరణము
గావించి శపథమును జేయుదు నని యెన్నియో శపథములు
పలికినను బ్రహ్మరాక్షసుఁ డంగీకరింపక పోఁగాఁ దుదకు

'విష్ణుతో నివ్వాల నొక్కవేల్పు గణియించినపాతకి నౌదు' నని ప్రతిన సలిపినాఁడు. బ్రహ్మరాక్షసుని కది యొడఁబా టైనది. విష్ణుదేవునితో మఱొకవేల్పును గణించుట కూడ గొప్పపాపముగాఁ దలపోసినమహాభక్తిసంపన్నుఁడు మాల దాసరి.

తరువాత మాలదాసరి సత్యవ్రతమునకు సంతోషించి బ్రహ్మరాక్షసుఁడు గీతకీర్తనఫలము నిమ్మని యాతని నడు గఁగా 'కంసరిపుభక్తుల మొకండె కాము కాని' యని పలికి దిక్పాలాదిజన్మములను, సోమయాజి మొదలగుజన్మములను గూడఁ గ్రిందు చేసి కంసరిపుభక్తుని జన్మము దొడ్డది యని పలికినాఁడు. వేలకొలఁది జన్మముల ఫలముగాఁ-దన జన్మాంతరపుణ్యమువలన లభించిన కంసరిపుభక్తజన్మమునయం దాతఁడు పొందిన గీతకీర్తనఫలమును బ్రహ్మరాక్షసున కీయఁ దలఁపకుండుటలో నాతని విష్ణుభక్తిపారమ్య మతిసూక్ష్మ ముగా మనకుఁ దెలియవచ్చుచున్నది.

మాలదాసరి సత్యవ్రతపరాయణుఁడు. బ్రహ్మరాక్షసు నెట్లో యొప్పించి యాతఁడు కుఱుంగుడికిఁ బోయి యచటి విష్ణుదేవునికిఁ జూఁగిలి మ్రొక్కి రణద్వీపంచి యై స్తుతికలిత ప్రబంధములఁ బాడినాఁడు. అచ్చటనే కాలహరణము సేయక యాతఁడు 'అసత్యభీభరద్రుతగతిని' వ్రతపూర్తి గావించు కొని బ్రహ్మరాక్షసునికడకు వచ్చుట గమనార్హమైనవిష యము. వచ్చినంతనే 'పంచుచో నేచరణంబు లేయుదర మేయుర, మేశిర మేకరంబులుఁ బచరణంబు లాయుదర మాయుర మాశిర మాకరంబులఁ' గలుగఁ జూచుకొను

మనినాఁడు. అతని సత్యమునకు బ్రహ్మరాక్షసుని నేత్రాంబు లురలినవి. అతఁడు ప్రమదపులకితగాత్రుఁ డయినాఁడు. ఇనుని మధ్యందినపు టెండలోఁ దనదు పెద్దబట్టతల మించఁగాఁ బాటి వచ్చి యాపాఱుటసుర కొండవలె. నామాలదాసరికి భక్తిమైఁ బ్రదక్షిణము గావించి బిగ్గఱగా రొదలు సేయుచు నమస్కరించినాఁడు.

శా. 'ఈసర్వంసహా దేవదానవమహీభృన్మానివాచాతప
శ్శ్రీసర్వస్వము నేతదన్యకృతులం జెప్పంబడు న్ఘోర మా
నీసత్యం బురరీకృతాంతమిల నెంతే నృద్ధ నై మంటి నే
నాసత్యం బిఁక నిన్నుఁబోలెఁ గృతసంధాధూర్వహు
[ల్లేమికిఁ.'

అని బ్రహ్మరాక్షసునిచేతనే మెప్పు పొందినమాలదాసరి సత్యవ్రతము ప్రశంసనీయము కదా!

మాలదాసరి కృతజ్ఞతాస్వభావము స్తుతిపాత్రము. తన శపథమును నమ్మి భగవత్సంకీర్తనమునకు, ననుదినవ్రతనిర్వహణమునకు నవకాశ మొసఁగినబ్రహ్మరాక్షసు నౌదార్యమును మాలదాసరి గుర్తింపక పోలేదు. 'కృచ్ఛలబ్ధ మైన గ్రాసము నుడుగుట సామాన్య మైనవిషయము కాదు! మఱియు బాసలు బండికండ్లు. ప్రాణభయమున నొక లక్ష సేయవచ్చును. అట్టిచో బ్రహ్మరాక్షసుఁడు తన్ను నమ్మి విడిచి పుచ్చె ననఁగా నాతని యుదారబుద్ధి యెంతటిదో, దానిమూలమునఁ దన కెట్టిమహాఫలము లభించెనో తెలిసియే మాలదాసరి 'ఓయి! రజనీచరేంద్ర! నీయురుకృపాకటా

క్షమునఁ జేసి ధన్యుఁడ నైతి' నని పలికి తన కృతజ్ఞతను వెల్లడించుకొనెను. అంతటితో నూరకుండక వేధ విధించినకూ ఱైనతన్ను బ్రహ్మరాక్షసుఁడు భక్షింపక మఱేదైనఁ బలికిన యెడలఁ దనమీఁద నొట్టనెను. ఇందు మాలదాసరి కృతజ్ఞతాభావము మిన్నంటుచున్నది.

మాలదాసరి దయార్ద్రహృదయుఁడు. విష్ణుభక్తుఁడైనయాతఁడు తన్ను బ్రహ్మరాక్షసుఁ డతిదీనముగ—

క. 'నీవంటి భాగవతులుం
బావనులుగఁ జేయరేని మఱి గతి యేదీ?...'

అని వేఁడుకొని, మాలదాసరి యాతనివాంఛిత మెటిదో తెలుపు మనఁగా 'కైటభారిం బాడిన నేఁటిపాట ఫలంబును' సజలంబుగా నిమ్మని యడుగును. అపుడు మాలదాసరి 'ఒకనాఁటిది కాదు. ఒకత్రుటి గీతఫలంబు నైనను నీయనొల్ల'ననును. దయాస్వభావము గలమాలదాసరి బ్రహ్మరాక్షసుని వేఁడికోలును వెంటనే మన్నింపక పోవుటలో న్యాయము లేక పోలేదు. దిక్కాలాదిగా నెన్నో జన్మముల యనంతరము తనయదృష్టవిశేషమున మానవ జన్మమును, నందులోఁ గంసరిపుభక్తజన్మమును బొందినతాను గష్టపడి సంపాదించినపుణ్యఫలమును 'కప్పురంబు వెట్టి యుప్పు గొనుట'గ నాతఁడు బ్రహ్మరాక్షసుని కొసంగుట కిష్టపడక పోవుట న్యాయమే. కాని బ్రహ్మరాక్షసుఁ డంతటితోఁ బోక—

క. 'సంగీతఫలంబున గో
సంగీ ! సగ మైన దయ పొసఁగ నీవే మ్రొ
క్రిందినగ్రుక్క్ర వారిధి
కిం గొఱఁతయె కొదయె విష్ణుకీ ర్తన...'

కని మఱి మఱి ప్రార్థించును. అదేహ మడిగి యట్లు తన్ను నొంచుచున్నబ్రహ్మరాక్షసుని మందలించియు, బ్రహ్మ రాక్షసుఁడు తన పాదములపై వ్రాలి పాటం బాతిక పా లేని నిమ్మనికోరఁగా మాలదాసరి యీాయ ననును. అపుడు బ్రహ్మరాక్షసుఁడు ప్రభాతసమయమున, బాడినచరమగీతఫల మునైన నిచ్చి ప్రపన్నుం డైనతన్ను నవిపన్ను, జేయు మని పాదములను బట్టుకొని లేవకుండఁగాఁ జేయునది లేక యాతఁడు పరమదయార్ద్రుఁ డై 'యట్లే కానిమ్ము. లె' మ్మనినాఁడు. పాటలో, బాతికపాలు కూడ నిచ్చుట కంగీక రింపనిమాలదాసరి బ్రహ్మరాక్షసునిమీఁద, దనకు, గలిగిన జాలిచేతనే చరమగీతఫలము నైన నిచ్చినాఁ డని మనము గ్రహింపవలెను. కనుక సంగీతఫల ముదారముగ బ్రహ్మ రాక్షసు, డడిగినంతనే యీాయక మాలదాసరి బెట్టు చేయు టలో నాతని శీలమునకు, దక్కువదనము రాక పోఁగా నది యాతని దయాస్వభావమునకు మఱింత వన్నె తెచ్చుసన్నివేశముగా నున్నది.

మాలదాసరి రాయలవారి ప్రతిభాచిత్రము! అతని వేషము, వాదపుఁదీరు, సత్యనిష్ఠ, విష్ణుభక్తిపారవశ్యము, కృతజ్ఞతాగుణము ననునవి మన కాతని మఱింత సన్నిహితునిఁ జేయుచున్నవి. ఏనాఁటివాఁడో యయిన కావ్యపాత్రమువలెఁ గాక మాలదాసరి 'మాంసకండరముల'తో మన యెదుటఁ గావ్యములో సజీవుఁడై సాక్షాత్కరించు చున్నాఁడు. ఇట్టి ప్రతిభాసహజమూర్తిని మాలదాసరిని జిత్రించిన రాయల వారిప్రజ్ఞ నిస్సామాన్యము!

శాలీనుఁడు

ఆంధ్రప్రబంధపురుషులలో శాలీనుఁడు ఒకమధుర ప్రకృతి. సూరనార్యుని కావ్యకళాసృష్టిలో నితఁడొక సురుచిర సన్నివేశము. కళాపూర్ణోదయములో సూరనార్యుని యమృతహస్తసంస్పర్శముచే నుజ్జీవితము లైనకావ్యపాత్రములలో నితఁడు కళాపూర్ణుఁడు.

మనుచరిత్రములో 'వివిధాధ్వరనిర్మలధర్మకర్మదీక్షా పరతంత్రుఁడు' గా, అనుకూలవతి తనమనసులో వర్తించు కులకాంత సోమిదేవితో సంసారపక్షముగాఁ గాఁపురము వెళ్ళఁద్రోయుచు నతిథిపూజాప్రవణుఁడు గా, నమరకాంతలే వలచి పయికొని వచ్చిననుగన్నెత్తి చూడనిధార్మికుఁడు గాఁ, బరకాంతాపరాఙ్ముఖుఁడు గాఁ జిత్రింపఁబడిన ప్రవరుని ప్రకృతికి, శాలీనుని ప్రకృతికిఁ జాల భేదము కలదు. అసలు ఆపాత్రల సృష్టికి నబ్జాసనకల్పులు పెద్దనసూరనల దృక్పథము లే వేఱు. పెద్దన్నది ధర్మదృష్టి! సూరన్నది కళాదృష్టి! వారి విభిన్నదృక్పథముల మూర్తీభావమే ప్రవరుఁడును, శాలీనుఁడును.

శాలీనుఁడు ఇల్లటపుట్టల్లుఁడు. ఇతని తలిదండ్రు లెవ్వారో మనకుఁ దెలియదు. సుగాత్రి యితని భార్య. ఆమె కాశ్మీరభూమికిఁ గర్ణిక యగుశారదాపీఠమున శారదను భజించుపూజారి బ్రాహ్మణపుత్రి. ఇల్లటపుట్టల్లుండ్రకు సాధారణముగా నత్తవారింట నెట్టి చనవుసంతనము లుండునో

శాలీనునికిని నట్టివే కలవు. అత్తగారికి నోరు కొంచెము పెద్దది. ఆయింటిలో నామెమాటకుఁ జెలామణీ యెక్కువ. శాలీనునికి నామెయెడఁ జనవు తక్కువ. అందుచేత నితఁ డామెకడ నెన్నఁడును నోరు మెదపఁడు. తన కోరికలకుఁ గల్లెము పట్టి దానిని లోననే యడఁచుకొనును గాని వెలికిఁ జెప్పఁడు. చెప్పినను నాతనిఁ గా దనువా రాయింట నెవ్వరును లేరు. అయినను నతనికి ధైర్యము చాలదు.

నాఁడు తొలి కలయిక. ముత్తైదువులు ముచ్చట పడి సుగాత్రిని జక్కఁగా నలంకరించి పంపిరి. సుగాత్రి 'యలం కారకలిత' యై యరుదెంచినది. శాలీనునికి సహజసౌందర్య మునందుఁ బ్రీతి. బుట్టబొమ్మకుఁ దొడిగినట్లు నిలువున నొక్కటే యలంకారపుఁదొడు గతనికి సరిపడదు. అందుచేఁ దద్విభూషణాది మహిమఁ దలఁకి యతఁ డామెను జేరఁదీయ లేదు. పాపము! 'తరుణి యుండి యుండి తిరిగి పోయినది'—రెండు మూఁడు రాత్రులు గడచినవి. సుగాత్రికి వట్టి రాకపోకలు మాత్రమే దక్కినవి. శాలీనుఁడు మాత్రము 'ఆది నేభావమునఁ జూచె నట్లె' చూచుచుండి నాఁడు. మగఁ డొల్లమికిఁ గారణము సుగాత్రి తెలిసికొనఁ జాలక పోయినది. శాలీనుఁ డయినను దన కిష్ట మిట్టిది యని చెప్పఁడు. చెలిక త్తెలకుఁ, దల్లికి విషయ మిట్టి దని బోధపడ లేదు. తల్లియనుమతిని బ్రియవయస్యలు సుగాత్రితో నేకాంతమున—

క. 'కాంతుఁ డుచితజ్ఞుఁ డైనను
గాంతకు సిగ్గువడఁ జెల్లుఁ గాక కటకటా!

కాంతుఁడు సిబ్బితికాఁ డై
కాంతయు నయ్యెన నెట్లు కాఁపుర మింకన్.
గీ. నలినవదన ! యెన్నినా ళ్లైనఁ జిన్నకూఁ
తురవు గావు, నీవె తొడఁగి పతికిఁ
దగినసేవ సేయ కగునె యూరక యుండ
నాతఁ డేమియు ననఁ డనుచు నిట్లు.

క. గారామునఁ దోట్తోడన
రార మ్మనఁ డనుచు మగుడి రా నేటికిఁ? గ
ర్పూరంబుతోడి బాగా
లీరాదో? యాకు మడిచి యీరాదో? చెలీ!"

యని తత్త్వము నుపదేశించినారు.

క. 'వెంగలివి గాక నీ వో
యంగన! భోగములపంట యామని యగునీ
బంగారువంటి పాయము
సంగతియే యకట! రిత్తశయ్యకు నొసఁగన్.

క. యౌవనము గలిగినప్పుడె
పూవుంబోఁడులకుఁ బతుల్భోగంబులు గా
కావిభవములకుఁ గొఱయే
యో వనజాతాక్షి! ప్రాయ ముడిగినవెనుక'.

అని యదనున హెచ్చరికఁ జేసినారు.

సుగాత్రి తదీయయుక్తుల తెఱఁగు నొనరించి చూచి నది. కాని శాలీనుని ప్రవృత్తిలో సంచలనము లేదు. సుగాత్రికి

మగనిపై ననురాగము సడలలేదు సరికదా 'యీాయన నింక నేమి ప్రపంచంబుఁ జేసిన నెఱయ నెరసి పోవుట తక్కఁ బ్రయోజనం బేమియు లేదు. నాకును మంగళసూత్రం బీపాటి శుభస్థితి నుండుటయ పదివే' లనుచు నెంచుకొనినది. అంతటితో నూరకొన లేదు. వే ఱొక్కలాగున నుండక యతనికే నాయురభివృద్ధికరంబు లని వివిధాలంకారంబు లెప్పుడు నేమఱక తాల్చుచుండినది. శాలీనుఁడు నులుకఁడు, పలుకఁడు. తన కది యయిష్ట మని తెలుపఁడు. అత్తగారికి నోరిమి యంతకంతకు సడలుచుండినది. సుగాత్రి మగనిమీాఁది మమకారముచేఁ దనతల్లి యతని నేమియు నిట్టిట్టూడకుండఁ బ్రార్థించుచుండినది. ఓర్చి యోర్చి యోరిమి దిగజాఱఁగా నొక్కనాఁడు తల్లి సుగాత్రితో—

ఊ. 'ఇట్టినిరర్థ నెందుఁగన మే మనఁ బోయిన నీవు మిక్కిలిం దిట్టెదు, నాదుసంపదకు దిక్కగుచున్ మగ మొల్క నీ కిఁకన్ బుట్టునో యంటిమే నితని పోడిమిఁ గంటిమ, వట్టిగొడ్డుతా కట్టితఁ డెంత యున్న, నినుఁ గాఱేయ వెట్టుట వెళ్ళఁదోలినన్'

అనినది. పాపము! సుగాత్రి కడుపు పండి యొక మగ మొలక మొలిచిన చూడవలయు నని యామె బులుపాటము! దానిచే ననుభవమున కధికారులు లేనితనయమూల్యసంప దకు మగదిక్కు గలుగు నని యామె యాశ. శాలీనుని యిల్లటీకము వట్టిగొడ్డుతాకట్టుగా నున్నది. పోనీ యతని వెళ్ళఁ దోలెద మన్నఁ గూఁతురిని గాఱేయ వెట్టుట యగును. మ్రింగను రాదు. క్రక్కను రాదు. అట్టిది యామె యవస్థ!

కడకొక యుపాయ మాలోచించినది. 'పూవులతోఁట కైన
నటు పోయి విచారము చేసి రమ్మనంగా వలయుం గదా!'
యనుకొనినది. అతనిఁ బిలిచి యట్టికట్టడఁ జేసినది. శాలీ
నుఁడును,

'దివిజనుత యైనశారదా దేవిపూజ
కుపకరించుకార్యం బిది యొప్పు ననుచు'

సంతోషముతో నాపనికి మెయికొనినాఁడు. మఱియు నతఁడు—

సీ. నీ రొత్తువేళల నీ రొత్తుఁ బాదుపా
దునకుఁ గాలువలు పొందుగ నమర్చి
త్రవ్వటంబులతోఁ ద్రవ్వటంబులు పెట్టుఁ
దగినట్టు కట్టి గుద్దలి గడించి
యెరువుఁ జల్లెడుసావి నెరువుఁ జల్లు గతాభి
మానుఁ డై గంపలఁ దాన తెచ్చి
యం ట్లొత్తుపదనున నం ట్లొత్తు నెలమిఁ గా
స్పించుచేఁగొమ్మలు వంచి వంచి

గీ. నారు వోయంగ వలయుచో నారు వోయుఁ
గొమ్మ నాటంగఁ దగునెడఁ గొమ్మ నాటు
నొకట విసువక యంతకంతకును హెచ్చు
హాళితోడను శాలీనుఁ డవిరతంబు.'

తోటమాలిగా నతఁడు—

క. 'ఎంతయుఁ బ్రొద్దున లేచి ని
తాంతాచరితస్వజాతిధర్మఁ డగుచు ని
శ్చింతుఁ డయి గురుపరంపరఁ
జింతించి తదుక్తజపము చేసి ముదముతోన్.'

గీ. నియమమునఁ బుష్పములు గోసి నేర్పు మీఱఁ
బలు తెఱంగుల వింతవింతలుగ మాలి
కలును బొందులుఁ గందుకంబులు రచించి :

బ్రహ్మాయిల్లాలికిని సమర్పణము సేయు...'

చుండినాఁడు. మగని కష్టపాటును జూచి యోరువఁజాలక సుగాత్రి తానునతనికిఁ దోడుపడఁ దలఁచును గాని సిగ్గు తెఱ మఱుఁగై యామెను మఱలించుచుండినది.

శాలీనుఁడు తోఁటకుఁ బోయి యుండఁగా నొక్క నాఁడు పెనువాన గురిసినది. నాఁడు సుగాత్రి మగనిక్కై యలమటించి పోయినది. ఆమె తల్లడ మింతిం తన రాదు. శారదను బ్రార్థించినది.

శా. 'ఈ దేహంబునఁ బూర్వ దేహములయం దేనిన్ వ్రత
ధ్యానదా
నాదిప్రోద్భవ మేమి యేమి గల దాయాపుణ్య మీవర్ష పీ
డాదోషంబునుమ త్పతింబొరయకుండన్మానుపుం గాతనే
నాదుం గావుతఁ దన్నిమి త్తపతిపాపాక్రాంతికిం
బాత్రమన్.'

అని శారదను ప్రార్థించుచు మగనిఁ జూడ బయలు దేరినది. ప్రాణవల్లభుం డున్నవనంబునఁ గడన యుండి పరికించినది. ఆత్మసంప్రార్థితబ్రాహ్మప్రసాద విశేషంబున నెప్పటియట్ల శుభవర్తనంబున నున్నతనభర్తను జూచి నది. సరస్వతిఁ గొనియాడి యిల్లు చేరినది.

సుగాత్రి లజ్జపెంపునఁ గొన్ని నాళ్లదనుక వల్లభుని యిడుమపాట్లకు నోర్చికొనియే యుండినది. ఆ యోరిమి

చాలకాలము నిలువ లేదు. సిగ్గు జోహారు చేసి తొలఁగి నిలిచినది. అంత 'తల్లి మాట యొక్కింతయుఁ దాను గైకొనక యెప్పటియట్ల యలంకృతాంగి యై' ప్రియుఁ డున్నవనంబులోని కరిగినది.

క. 'తనసొమ్మ్ల లెల్ల నొకమఱుఁ
గున నిడి పిరిచుట్టు చుట్టుకొనినవలువతోన్'

మగనికిఁ దోడుపడినది. అదనుఁ జూచి మదనుఁడు విల్లు తొడిగినాఁడు. శాలీనుఁడు తన కిష్ట మయినసౌందర్యమును సుగాత్రిలోఁ జూచినాఁడు. అతని మనసులో వలపులు కులుకులాడినవి.

అపుడతఁ డట్లు పేర్చుకుసుమాస్త్రుని యుద్ధతి యూహ లేక 'వె
ఱ్ఱిపడుచ! యెంత మాన్చిన నెఱింగెడుదానవు గావు నీకుఁ దోఁ
టపనుల కెంత దూర మకటా!' యనుచుం దన యుత్తరీయవ
స్త్రపు మునికొంగునం దుడిచెఁ దన్వికపోలపు ఘర్మబిందువుల్.

అంతటితో నతని తమి యాగ లేదు. ఎక్కుడు తమకముతో సుగాత్రిని దల గ్రుచ్చి కవుంగిలించు కొనినాఁడు. చిగుళ్ల జొంపముల సొంపగు పూఁబొదరింటికిఁ దార్చి సుగాత్రిని మదనమహారాజ్యభోగమహిమయందుఁ దేల్చినాఁడు. సుగాత్రి తన పుణ్యము పండిన దనుకొనినది. మగఁడు తన్ను ముట్టినందులకే మురిసిపోయినది. ఇన్నినాళ్లు మగఁడు తన్నొల్లమికిఁ గారణ మామె యాతని నడుగ లేదు. అతఁడు చెప్పలేదు. అంతటి పారవశ్యములో వారి తొలికలయిక

జరగి పోయినది. వారి యానందములో నీ ప్రశ్నము లడు
గునఁ బడిపోయినవి.

సుగాత్రి 'యివి మిగులఁ గ్రొత్త లింటికి నేఁగవలదె'
యని ప్రియముఁ జెప్పి విడిపించుకొనినది. మఱుఁగున డాఁచిన
కొన్న భూషణములఁ దొడుగుకొని యల్లల్ల నిల్లుఁ జేరినది. సఖు
లావులించినఁ బ్రేవులు లెక్క పెట్టువారు. సుగాత్రి ముఖ
వికాసముఁ జూచి గుట్టు తెలిసి రట్టు చేసిరి. తల్లి ప్రమోద
మందినది. శాలీనుని హృదయములో—

సీ. గతిసంభ్రమంబునం గరము బెడంకుచు
నకనక లుడుచునెన్నడుముసొబగుఁ
గుఱుమాపు దడిమంపుఁగోకలోఁ దొలికెడు
కంపమానసితంబకాంతిసొంపు
బిగువుపయ్యెదలోనఁ బిక్కటిల్లుచుఁ జాలఁ
ద్రుళ్లుచన్నుల నొప్పుమెళ్ళపేరుఁ
జెమటచిత్తడిఁ జిట్లి యమరుకస్తూరిచుక్క
బొట్టుతోడి పసపుఁబట్టుసిరియుఁ
గీ. గునిసి సారెకు వడఁకెడుగొప్పకొప్పుఁ
గలిగి యాకెద న్నొకటియుఁ జలుప నీక
తోడఁ బరువులు వాఱుచుఁ దోఁటపనులు
సేయుమాపు.....' హత్తుకొని పోయినది.

నాఁటిరాత్రి సుగాత్రి యెప్పటికంటె మిగుల నలంక
రించుకొని కేళికాభవనమున కేఁగినది. ప్రొద్దుటి యను
రాగము స్మరించి మగఁ డాదరించు ననుకొనినది. కాని

155807
600 008.

శాలీనుఁడు తెప్పలు విచ్చి చూడనైన లేదు. సుగాత్రి చేసికొని వచ్చిన నగలసింగార మతనికి వెక్కసముగాఁ దోఁచినది. పాపము! గంపెఁడాసతో వచ్చినసుగాత్రి కేమియుఁ బాలువోవ లేదు. ఇప్పు డైనను మగఁ డుదయమునఁ దన్నేలుటకు, నిప్పు డొప్పరికించుటకుఁ గారణ మామె యెఱుగ లేదు. కడుం దడ వుండి యుండి 'నాచేసిన నేర మేమి?' యని తలపోసినది. తిరిగి యరుగఁ దలఁచినది. అక్కడ మాత్ర మెవ రున్నారు గనుక నని యూఱడిల్లినది. దైవ మెట్లు పెట్టునో య ట్లగుఁ గాక యని నిబ్బరించుకొనినది. తలుపు కడన నిలిచినది. శాలీనుఁడు పలుక లేదు. పలుకరించ లేదు. ఆట కట్టిపోయినది. ఇరువురుఁ గొంతకాలము మూఁగనోము పట్టిరి. సుగాత్రి కిఁక లాభము లే దని తోఁచినది. సాహసించి శాలీనునికడ కేఁగినది. 'కడుఁ ద్రిమ్మటచే శ్రమ మొందినారు గాఁబోలును! బోదునా? నిదుర వోయెద రే' యని కప్పురంపుఁదాంబూలము తావి భుగ్గు రని ముంచుకొనం జెవిదండఁ బల్కినది. నగలబరువుచేఁ గన్నులు మూఁతలు పడి పరాకునుండి యప్పు డప్పుడే తేరుకొని శాలీనుఁడు 'ఏ కోర్కిని వచ్చి' తని యడిగినాఁడు. ఇది యేమి ప్రశ్నము? ఈప్రశ్నము తోఁటలో సుగాత్రి తనకడకు వచ్చినప్పుడు తోఁపలే దేమి? సుగాత్రి యే మనఁగలదు? ఇఁక ననుట కేమున్నది గనుక? అయినను వావిచ్చి 'లోకమువారలు పతికడ కేకోర్కిని వత్తు' రని యడిగినది. ఇఁక నిలుపోపక 'పుణ్యసాధ్వికి గుణంబది గామి యెఱింగియుఁ' దాలిమి తూలి—,

TL
035,6x
35N56.

మ. 'అకటా! యే మని దూఱుదాన నిను
నాథా! వేగుజా మయ్యెఁ బొం
దికగాఁ బాదము లొత్త రమ్మనుట
గానీ, యొంటి యేమో కదా
నికటక్షోణికి నేఁగుదె మ్మనుట
గానీ! కొంత నెయ్యంపుఁబూ
నికతోఁ గన్నులు విచ్చి చూచుటయ
కానీ లే దొకింతేనియున్'

అని తూలనాడినది. శాలీనుని హృదయములోఁ గదలిక లేదు. అతని ముగ్ధహృదయ మాతెచ్చి పెట్టుకొన్న సౌందర్యమున కుస్మ్మళము కాలేదు. కడుపులో లేనిది కౌఁగిలించు కొనిన వచ్చునా? శాలీనుఁ డుపు డొకచిగిరింత లేనిమ్రొగ్గు. అతని హృదయ మొక పలుగుతొయి!

సుగాత్రి యంతరంగమునఁ గంతుసంతాప మంత కంతకు నతిశయించినది.

క. 'తాయైనఁ గొంతమేల్ నా
రాయణ! మీమనసుకంటె రహి నిఁక నెపుడుఁ
మీయంత దడవెదరె' యని
యాయంగన యతని పాద మల్లనఁ .....

బట్టినది. పానుపుకడఁ గూరుచుండి యూరువులపై నతనిపాద ములనిడి యొత్తుచు గాలుపుఁగూరిమిచేఁ జనుకట్టునఁ గన్నులఁ జెక్కటఁ జక్క నద్దికొనినది. అతఁడు పరాకు విడువలేదు. సుగాత్రి కొందలపడి మఱులఁ బలికినది.

ఉ. 'చిత్తము వేఱొక్కరెపయిఁ జేర్చి
మరల్పఁగ నేర రేమొ! మీ
రత్తరళాక్షిఁ దెచ్చుకొనుఁ డా
యక నావశ మైనఁ బంపుఁ డేఁ
దెత్తు నవశ్యమ్ము మఱియు
దేవరకుంబలె నవ్వధూటికిం
దొత్తగుచుఁ బనుల్ సలుపు
దున్ నిజ మూఁడెద రైవసాక్షిగన్,

క. తుదఁ జిక్కఁ లేల? మీ మది
కొద దీతినఁ జాలు నమ్మికొనవలసిన వ
చ్చెద నమ్మికొనుఁడు న న్నో
హృదయేశ్వర! యేమి చింత యిది? ధైర్యఁ దగున్'.

సుగాత్రి పత్యనురాగము, పాతివ్రత్యము పరాకాష్ఠ చెందినవి. తమచిత్తము మెచ్చినతొత్తునకుఁ దొత్తు నయ్యెద ననినది. అది తనచేతిలోని పనియే యయినఁ దానే యాయ్కఁ దెచ్చి యిచ్చెద ననినది. తుద కతని మదికొద తీఱునెడలఁ దన్నే యమ్మికొను మనినది. ఇంతకంటె నే మనఁగలదు? ఇంతకంటెఁ దా నేమి చేయఁగలదు? ఆమె పాదసంవాహనము చేయుచునే యున్నది. అతఁ డవు ననిఁ కాని, కాదని కాని, తనకోరిక యిట్టి దని కాని చెప్పలేదు. ఇంతలోఁ దెల్ల వాఱినది.

మఱునాఁడు తొలినాఁటియట్ల తోఁట కేఁగినది. మగ నికిఁ దోఁటపనులలోఁ దోడుపడినది. పతి యాదరించినాఁడు.

పరవశమున నిరువురు మయి మఱచినారు. సుగాత్రికి 'కిట్టుకు' తెలిసి పోయినది! మగనికి 'అట్టిసొంపులే గాని భూషణా లింపు గామి' తెలిసికొనినది. మగఁడు చెప్పి తాను దెలిసికొన లేదు. తా నడిగి తెలిసికొన లేదు. తన యను భవముతోఁ దెలిసికొనినది. వారిచిత్తములు పొరలతెరల పీడినవి. అనురాగరసమున వారిచిత్తములు రంజిలినవి. వారి దాంపత్యజీవనము తిన్నఁగా సాఁగిపోవుచుండినది.

ఇందు సుగాత్రిపతిశీలత ప్రవ్యక్త మగుటతో శాలీనుని మధురప్రకృతి యడుగడుగున గోచరించుచునే యుండెను. శాలినుని మధురప్రకృతికి సుగాత్రి సాధనము. సుగాత్రి పతిశీలతకు శాలీనుని మధురప్రకృతి యెొరగల్లు! సుగాత్రి పతిశీలత ప్రవ్యక్తము. శాలీనుని మధురప్రకృతి మబ్బులోని మెఱుపుఁదీఁగ!

ప్రవరుఁడు పయికొని వచ్చినవధూధిని నొల్లని ధార్మిక తపస్వి. శాలీనుఁడు కులకాంతయెడనే సహజసౌందర్యము నభిలషించి తదనుభవము పడసినకశాతపస్వి. పెద్దన ప్రవరునికిఁ బయిచేయిగా నొకపాత్రమును సృష్టింపఁ దలఁచే సూరన్న చే శాలీనునిసృష్టికి దోహద మయినది. సాహిత్యాకాశమున శాలీనుని మధురప్రకృతి యొకధ్రువతార!

కాటమరాజు

ఉత్తమజాతిప్రబంధమునకుఁ బాత్రచిత్రణము, శైలి, వర్ణనము, కథాశిల్పము ననుకావ్యధర్మములు నాలుఁగును నాలుఁగు మూలస్తంభములవంటివి. ఈ నాలుఁగింటికిని జక్కని సమన్వయము గలిగియున్నప్రబంధమే సాహిత్యములో నుత్తమజాతిప్రబంధముగా గుర్తింపఁబడును. ఒక కావ్యముయొక్క యోగ్యత కాని యొక కవియొక్క యుపజ్ఞ కాని చూలవఱకు నాకావ్యములోని పాత్రములను దీర్చి దిద్దుటయొక్క విధానముపై నాధారపడియుండు ననుటలో సందేహము లేదు. పాత్రచిత్రణ మన్నది యుత్తమజాతి ప్రబంధమునకు నతిప్రధానముగా నుండవలసినముఖ్యధర్మములలో నొకటి!

పెద్దనకుఁ బూర్వ మున్నకవులలో నొక్క తిక్కన్నలోఁదప్ప నీ పాత్రచిత్రణము కానరాదు. వా రందఱును కథానాత్మకముగానే తమ తమ గ్రంథములను సాగించిరి. కాని పెద్దనవలె నాటకీయముగఁ బాత్రనిర్మాణము సేయలేదు. ప్రబంధరచనము నాటకీయముగా నున్నప్పుడు కాని పాత్రనిర్మాణ ముండదు. పాఠ్యములయినప్రబంధములయందే రస స్ఫూర్తికిఁ బాత్రనిర్మాణ మవసర మయినప్పుడు శ్రవ్యములయిన 'కాటమరాజుకథ' మొదలయిన గేయప్రబంధములలోఁ బాత్రనిర్మాణముయొక్క యావశ్యకత యిట్టిదని వేఱుగాఁ జెప్పనవసరము లేదు.

పాత్రముయొక్క యంతస్తత్వము - అతని వ్యక్తి - యివి సాధారణముగాఁ గని యా పాత్రముఖముగాఁ బలికించిన పలుకులమూలమునను, నితరపాత్రము లా పాత్రమును గుఱించి చేసిన ప్రశంసలమూలమునను జాలవఱకుఁ దెలిసి కొనవచ్చును. సిద్ధహస్తుఁడయినకవీశ్వరుఁడు నిర్మించినపాత్ర మేది యయినను బాఠకునిహృదయములోఁ గలకాలము నిలిచి పోవును. అతని హృదయసీమపైఁ జిత్రింపఁబడిన యా పాత్ర మును దుడిచివేయుట కెవరికిని సాధ్యము కాదు. పెద్దన ప్రవరుఁడు, సూరన శాలీనుఁడు, గురజాడ గిరీశము, వేదము వారి యుగంధరుఁడు నట్టి పాత్రములు. అదే పాత్రచిత్రణ మనఁగా.

కాటమరాజు కథలో 'కాటమరాజు' అట్టి పాత్రము. అతని రూపచిత్రణము మన హృదయసీమనుండి యెన్నఁడును జెఱగి పోదు. అతని పాత్రచిత్రణవిధానమునఁ బరిశీలించు టకు ముందు 'కాటమరాజుకథ' లోని ప్రధానకథావృత్తాం తము నొకింత తెలిసికొందము.

కాటమరాజుకథలోని కథావృత్తాంతము లోకలు రికార్డులయం దిట్లు కలదు.

" నల్లసిద్ధి దేవచోళమహారాజు నెల్లూరిపట్టణమందు సింహాసనారూఢుఁడై పృథివి సాంబ్రాజ్యము సేయుచుండ గాను వారివద్ద రణతిక్కన అనేబ్రాహ్మణుడు సేనాధిపతి. ఇతనికే ఖడ్గతిక్కన అని పేరు కలదు. అప్పుడు యాదవవంశో

దభ్భవుం డైనకాటమరాజు, యితని పినతండ్రి పోలమరాజు, యీపోలమరాజు కొమారుడు కరియావులరాజు వీరు లంక మల – పాలకొండ – నల్లమల మొదలయిన పర్వతప్రదేశ మందు అరణ్యములో పచ్చికపట్లను తమయొక్క- విస్తార మైనగోగణమును సంరక్షణ చేసుకుంటూ నలసిది చోళ మహారాజుకు పుల్లరికిగాను తమమందలలో ఆవులకు పుట్టే కోడెదూడలు కొన్ని యిచ్చేటట్టున్ను, వారిదేశమందు వుండే కసువు పచ్చికపట్లు తమగోగ్రాసముగా యిచ్చేటట్టుగాను నిర్ణయించుకొని కొంతసైన్యం అందలాలు యేనుగులతో ప్రసిద్ధిగావుండేవారు. మరికొన్నిదినములకు తొమండశపల్లను గోవులు గ్రామములో యెక్కడ యెక్కడ వున్నసస్యము లను మనుష్యుల అంకిలో నిల్వక మేసేది గనుక ప్రజలు రాజుతో యీ సంగతి విజ్ఞాపన చేసుకొన్నయెడల బీడు పచ్చికపట్లు యావత్తు కాటమరాజుగారి గోవులు మేపుకొనే లాగున మాటయిచ్చినాము. పైలు వారు మేపుకోవలసి నది కాదు. పైలు జాగ్రత్త చేసుకోనేది అని-పైలు మేప వద్దు. బీడుపచ్చిక మేపుకొనేది అని కాటమరాజుగారికిన్ని వ్రాసి పంపించిరి. ఇది గాక అరణ్యప్రదేశమందుల కాటమ రాజుగారి విస్తార మైనగోగణం తిరిగి మేస్తూ వుండేది మొదలు కొని గోసంరక్షణార్థమై కాటమరాజువారు అగపడ్డచోట క్రూరమృగములను వారే వధ చేస్తూ వచ్చేవారు గనుక అరణ్యమందు గోగణ గోపాలకులయొక్క సమర్థము విస్తార మైనందున సాధారణముగా మృగములు అరణ్యమందు నిల వక పోతూ వచ్చినందుననున్ను మృగవధ చేసుకొని తత్సా

మాన్యవృత్తివల్లను జీవనోపాయం కని వుండేకిరాతకులకు జీవనహాని అయినందుననున్ను ఆకిరాతకులు కాటమరాజు యందు ద్వేషు లై యుండిరి.

యిది గాక నల్లసిద్ధిరాజుగారు వుంచుకొన్న భోగము దానివద్ద వక పెంపుడుచిలుక వకనాటి కాలమందు మ్యాడలో నుంచి తప్పించుకొని వెలపటికి వచ్చి అరణ్యశుకములను కూడి కాటమరాజు ఆవులమందల సామీప్యములకు సమూహముగా వచ్చి ధ్వనులు శాయగా కొన్నిగోవులు బెదిరి ల్యాగలను కలగ తొక్కుకుని పారిపోయినవి. అప్పుడు కాటమరాజు పినతండ్రి అయినపోలమరాజు చూచి బాణము సంధానం చేసి వేసినందున ఆబాణము సమూహములో వుండే పెంపుడుచిలుకకు తగిలి ప్రాణం విడిచెను. ఆచిలుక కాళ్లలో గజ్జలు అందెలు వుండేది పోలమరాజు చూచి యిది పెంపుడుచిలుక అని నిశ్చయం చేశెను. అంతట ఆసామీప్యమందున వున్నకిరాతకులు ఆచిలుకను తీసుకుని నల్లసిద్ధిరాజుగారు వుంచుకొని వున్న భోగముదానివద్దకి తీసుకొని పోయి అగపరిచి 'నీచిలుక తప్పివచ్చినంతట అన్యాయముగా కాటమరాజు పినతండ్రి అయిన పోలమరాజు బాణప్రయోగం చేసి చంపినా' డని చెప్పినంతట అది చాలా దుఃఖస్తురా లై అరణ్యములో వుండే క్రూరమృగాదులను వధ చేసేటట్టుగాను వ్యాట లాడుతూ వుండి కాటమరాజుగారి గోవులనున్ను వధియించు మని వుపదేశించెను. గనుక ఆకిరాతకులు కాటమరాజువద్దికి వచ్చి మేము సామాన్యమృగములను వధ చేసుక జీవనం చేస్తున్నా మని మనవి చేసినంతట కాటమరాజు అను

మానించక సెలవు యిచ్చినందున ఆకిరాతకులు అరణ్యమధ్య మందు మృగాదులను చంపినట్లుగా వుండి కొన్నిగోవులను గుండుతో వధ చేసిరి.

యీసమాచారములు కాటమరాజు విని చాలా ఆక్రోశముతో ఆకిరాతకులను చంపించి తదారభ్యం నల్లసిద్ధిరాజు గారికి యిచ్చేపుల్లరి యివ్వ మనిరి. అందుకు ఆవులమందలో వుండేకోడెదూడలు తమకు తోలి అంపించ మని నల్లసిద్ధివర్తమానం అంపించగా, కాటమరాజువారు 'మీశీమలో మా ఆవులమందలకు నిరోపాధిగా వుండినట్లు అయితే మీకు పుల్లరి యివ్వవలసినకర్తవ్యం. అటు గాక మీదేశములో వుండేకిరాతకులు మాఆవులమందలకు వుపద్రవం చేసి కొన్ని ఆవులను నిష్కారణముగా వధించినారు. గనుక మేము పుల్లరి యివ్వవలసిననిమిత్యం లే' దని ఖండనగా వ్రాసి పంపించినందుకు అదివరకు మందలలో వున్నకోడెదూడలను తోలుక రమ్మని కొంతసైన్యమును నల్లసిద్ధిరాజు పంపించి నందున వారు వచ్చి కోడెలను తోలుక పోవచ్చినంతట కాటమరాజువారు వచ్చినసైన్యమును లక్ష్యం శాయక తిరుగ గొట్టినారు. గనుక వారు తిరుగా నల్లసిద్ధిరాజువద్దికి పోయి యీవర్తమానములు యెరుక చేసినంతట నల్లసిద్ధిచోళ మహారాజులుంగారు ముఖ్యసేనాధిపతి అయినరణతిక్కనతో కూడా కొంత సైన్యమును కూర్చి కాటమరాజువారు సమాధానముగా కోడెలు యిచ్చినట్లయితే వుత్తమం. అటు కాని పక్షమందు వారివీరవిహార కార్యపెట్టి వున్నకోడెలు యావత్తు

మళ్లించుక రమ్మని పంపించిరి. అదేప్రకారం సేనాపతి రణ
తిక్కన్న వచ్చి సమాధానంగానే విహితముతో – యెప్పుడు
యిచ్చేప్రకారం మందలలో కోడెలను యిప్పించ మని
కాటమరాజువద్ద వర్తమానం అంపించగా వారు అనుకూలం
చక ప్రతిఘటించి వుత్తరవు యిచ్చినందున కార్యతిక్కన్న
యుద్ధసన్నద్ధు డాయెను. ఈయత్నము నిని కాటమరాజు
వారున్న వారికి విహితు లైనవార్ని కొందరిని సహాయ
ముగా కూర్చుకొని బలిమి గలఆవులు, కోడెలు సహా వెంట
కూర్చుకొని యుద్ధసన్నాహ మై నిలిచిరి. గనుక వుభయపక్ష
ములవారికి అఘోర మైనయుద్ధ మాయెను. ఆయుద్ధసమయ
మందు కాటమరాజువారి గోవులు యుద్ధభూమిని వచ్చి
నిలిచి యెదిరిసైన్యములో కొంతమందిని హతం చేసినవి.
అంతట రణతిక్కన కార్యం నిర్వహించ లేక తిరిగి తనయింటి
స్థలములోనికి లేచి పోయెను. ఇంటివద్ద భోజనసమయమందు
తిక్కన్న భార్య తాను స్నానము చేసే రహస్యస్థలమందు
రణతిక్కనకు స్నానానికి నీళ్లు వుంచి, స్నానం చేయ మని
చెప్పినంతట అత డాస్థలానకు పోయి చూచి ఆడంగులు
స్నానం చేసేరహస్యస్థలమందు నాకు నీళ్లు వుంచినకారణం
యేమి అని అడిగినంతట తిక్కనభార్య ప్రత్యుత్తరం
యిచ్చినక్రమము 'యేస్థలమం దైతే నేమి? రూపభేదము
వల్ల విశేషం లేదు గనుక యిక్కడనే స్నానము చేయ
వచ్చు' నని చెప్పినంతట తాను కార్యములోనుంచి తిరిగి
వచ్చినందున భార్య యీమాట చెప్పెను కదా అని తెలిసి
కొని స్నానానంతరం భోజనసమయమందు తిక్కనకు తల్లి

విరిగినపాలు వడ్డించినందున కారణ మేమని యడుగగా 'ఈ దినమున గోవులున్ను నీవు పోయిన స్థలానికే పోయి విఱిగి వచ్చినవి' అని చెప్పెను కనుక తాను కార్యములోనుండి తిరిగి వచ్చినందున యిందుకు దృష్టాంతముగ తల్లి ఆమాట చెప్పిన దని గ్రహించినవాడై భోజనోత్తరమందు తిరుగ కొంత సైన్యమును సమకూర్చుకొని యుద్ధానికి పోయేటప్పుడు తల్లిని, తనభార్యను పిలిచి 'పూర్వము ఒకభట్రాజు నామీద కృతిగా వకపద్యం చెప్పవలె నని ఉద్దేశించి నాల్గు చరణములు చెప్పినాడు. అది యేమంటే—

"ధైర్యంబు నీమేన దగిలి యుండుటఁజేసి
చలియించి మందరాచలము దిరిగె
గాంభీర్య మెల్ల నీకడన యుండుటఁజేసి
కాకుత్థ్సుచే వార్ధి గట్టఁబడియె
నల లక్ష్మి నీయందు నలరి యుండుటఁజేసి
హరి పోయి బలి దాన మడుగుకొనియె
నాకార మెల్ల నీయందు నుండుటఁజేసి
మరుఁడు ధూర్జటి కంటిమంటఁ గాలె"

యీ ప్రకారం భట్రాజు నాల్గుచరణములు చెప్పినందున అతనికి యెనిమిదివేల వరహాలు యిచ్చినాము. ఈ పద్యానికి యింకా నాలుగుయెత్తుగీతలు చెప్పవలసి యున్నది. అవి నేను సజీవుణ్ణయి వుండగా చెప్పరాదు గనుక నిల్పినాడు. తరువాత నాల్గుయెత్తుగీతలు పూర్ణముగా జెప్పి తీసుక వస్తున్నాడు. అప్పుడు ఆభట్రాజుకు మరిన్ని నాలుగు

వేల వరహాలు యిప్పించు' మని చెప్పినంతట ఆప్రకారం అంగీకరించిరి. అంత తిక్కన్న భార్య పెనిమిటిగూర్చి చెప్పిన మాట. 'యుద్ధరంగములోనుంచి తిరిగి రావడము లేదని ఆజ్ఞాపిస్తిరి కదా! తమ్ముని విడిచి దేహము పుంచేబుద్ధి లేదు గనుక యిప్పుడే శలవు యిమ్మని అడిగినందున 'నీకు అనుకూలం అయితే ఉత్తమపక్షము' అని సమాధానము చెప్పి తాను యుద్ధమునకు తిరిగి వెళ్లి వచ్చి కాటమరాజు వారిసైన్యముకు సమ్మఖుడై కార్యపెట్టి అఘోర మైన యుద్ధము చేసి అనేకమందిని హతం చేసెను. భట్రాజు రణ తిక్కనకు కృతిగా అటుపై పద్యం పూర్ణముగా చెప్పిన నాలుగు యెత్తుగీతలు—

'తిక్కదండనాథ! దేవేంద్రపురము నీ
వరుగు టెఱిగి నగము దిరుగు టుడిగె
అబ్ధి కట్టుఁ బాసె నచ్యుతుకోద దీఱె
మరుఁడు మళ్లి బుట్టె మగలరాజ!'

ఈప్రకారమున భట్రాజు పద్యము పూర్ణంగా నాలుగు యెత్తుగీతలు రణతిక్కనతల్లివద్దకు పోయి చెప్పగా ఆమె బహుసంతోషురాలై 'నాగర్భవాసంబున పుట్టినపుత్రుండు సుపుత్రుం డని రణతిక్కన్న పూర్వమందు చెప్పినప్రకారం గానే నాల్గువేలు వరహాలు భట్రాజుకు యిచ్చి మరిన్ని తగిన బహుమతులున్ను చేసెను. అంతట రణతిక్కనయొక్క భార్య తనపతి యైనరణతిక్కనతో సహగమనము చేసేనిమిత్తమై సచేలస్నానం చేసి అనేకదానములున్ను బ్రాహ్మల కిచ్చి

రణభూమిని ప్రదక్షిణనమస్కారం చేసి తనపతియొక్క కళే బరము గుఱుతు కనబడక యున్నందున స్వామిని ప్రార్థించి నేను పతివ్రత నైతే పతియొక్క శిరస్సు కనపడు నని నిశ్చయం చేసికొని 'రణతిక్క!' అనినంతట ఆ రణతిక్కన శిరస్సు యుద్ధభూమిని పడియున్న కళేబరముల మధ్యనుంచి పైకి యెగసినది గనుక ఆశిరస్సును గుర్తు పెట్టి తీసుక వచ్చి అందతో గూడా అనుగమనము చేసినది.

కాటమరాజువారి సైన్యములు హతశేషమైన యాదవులు యుద్ధరంగంబునందు తమతోకూడా నిలిచి శత్రువులను హతం చేసినవారియొక్క రూపము శిలలపై చెక్కించిన వీరులు అనేప్రతిమలు తాలూకు మజుకూరు సగిలి పాయకట్టు మాజే, కుంభగిరి అనేగ్రామములలో నున్నవి. ఇది గాక యుద్ధరంగంబున ప్రాణములు వదలి సద్గతి పొందినగోగణములయొక్క శిరస్సులు శృంగ ములతో కూడా తీసుక వచ్చి వాటికి పసుపు రాచి నిత్య సాంబ్రాణిధూపము లిచ్చి యిండ్లలో వుంచుకొని, యిది గాక గోవు ఆకృతిగా శిలలపైన చెక్కించి అవిన్ని ఒకస్థల మందు పూజలు చేస్తున్నారు. ఆశిలలు వుంచినస్థానకు జనులు 'ఆవులమాలె' అని చెప్పుకుంటున్నారు. ఆ ఆవుల మాలెయొద్ద పైన చెప్పినయాదవులు ప్రతిసంవత్సరమున్న తాళమేళములు, పంబజోళ్లు, వీరతాళ్లు, జమిడికెలు, వురవన మద్దెళలు, యీవాద్యములతో సంభ్రమం చేస్తున్నారు. ఈ సంభ్రమానకు వారిసంబంధికు లైనవారున్న, వారు కట్టించిన ఆవులమాలెయందు అభిమానం గలవారు యెంత దూరములో

నున్నా గాని వార్ని కాటమరాజుగారి 'పాంగ్యస్తులు' అని వాడుతున్నారు. అలాగంటే 'పాంగ్యస్తులు' అయినవారికి పసుపుగుడ్డను అక్షతలు గట్టి సంభ్రమం చేసేదిన్నం నిర్ణయం చెప్పి పంపించి వారిని పిలువ నంపించి అందరు గుంపు కూడి ఆవులమాలెవద్ద సంభ్రమము చేసేటప్పుడు పాంగ్యస్తులైన వారిలో వారివారికి తానకములు అనేనిర్ణయం కలదు. తానకమంటే యేమంటే యల్లెద్దుతానకం, బొల్లెద్దుతానకం, బోడియెద్దుతానకం, కర్రెద్దుతానకం, పైయెద్దుతానకం యీ ప్రకారం అనేకతానకములు నిర్ణయం కలవు. తానకసంజ్ఞ యేమంటే యెల్లెద్దుతానకంవాడు ఆవులమాలెవద్దికి వచ్చి నిలిచి ఉన్నప్పుడు పంబవాడు అంటే 'పంబజోడు' వాయించే వాడు యెల్లెద్దుపరాక్రమం తలచి ఆ ఆవు మేసుట, నీరు త్రాగుట, గంతులు వేసుట, యక్కడ యక్కడ తిరుగుట, తుదను యుద్ధరంగంబులో చేసినపరాక్రమం సహాగా పొగడితే ఆతానకం అనుసరించి వుండేవానికి శివం వచ్చేది కలదు. ఈప్రకారం కొంతసేపు తానకములు పాడినతర్వాత కాటమరాజుగారి పరాక్రమమును 'సుద్దులు' అని పాడేది కలదు. ఈ సంభ్రమములోను ఇండ్లవద్ద వుండే శృంగసహితము లైన గోశిరస్సులు తెచ్చి మాలెలో ఉంచేది కద్దు. అందుకు శన గలు, పెసలు నానవేసి శిలలపైన వుండే ఆవులప్రతిమల కున్ను, 'దేవరావులు' (దేవర+ఆవులు) అనేగోశిరస్సుల కున్ను నైవేద్యంచెల్లించి ఆపణ్యారం బ్రతికివున్న గోవులకు తినిపించేది కలదు. ఈ సంభ్రమము పేరు 'ఆవులపరువు' అని వాడుకొనేవారు."

కాటమరాజు యాదవకథానాయకుఁడు. ఇతని తండ్రి పెద్దిరాజు. తాత ఆవుల వలురాజు. కాటమరాజునకు మఱి యైదు నామాంతరము లున్నవి.

'నరజన్మ మెత్తుటచే నలనన్న
ఆవులఁ గాచుటచే ఆవులన్న
పశువులకు పట్టము గట్ట పశువులన్న
కాటకోటేశ్వరుడు, కాటమరాజు
కత్తేయుడు.' ఇవి!

ఈతని జననము ధాత నామసం॥ ఫాల్గున శుద్ధపంచమి గురువారము. ఆనాఁడు యాదవులకుఁ బర్వదినము. ఈతని నాధారముగాఁ గొనియే యాదవశాస్త్రము బ్రహ్మాండముగాఁ బెరిఁగినది. 'యాదవశాస్త్రం ఎద్దుమోతప్రమాణం' అని సామెతకూడఁ గలదు.

తండ్రి పెద్దిరాజునకు సంతానము లేక పోఁగా కల్యాణము సోమప్ప వరప్రసాదమున కాటమరాజును, పాపనూకమ్మయు జన్మించిరి. పెద్దిరాజు ఆర్నెల్ల పెంట రణములోఁ జని పోఁగా కుమారుఁడు కాటమరాజు కొంతకాలము ముత్తాసుల యిండ్లలోఁ బెరిఁగెను. ఆపై నాతఁడు రాజ్యము చేసెను. నాఁడీతఁడు తన పశువులమందను ఉత్తరదక్షిణభూములలో మేపు కొనుచు కాశినుండి కంచివఱకు వచ్చెను. నెల్లూరిలో నలసిద్ధిరాజునొద్దఁ బుల్లరి యొడంబడిక వ్రాయించుకొని పశువుల మేపుకొనెను. ఆ నల్లసిద్ధి చెల్లెలు కుందమాదేవి భూములలో వీరు పశువులను మేపఁగా సోమె యీతని పశువులకు నష్టము గలిగించినట్లును, నది కారణముగా కాటమరాజునకును, నల్ల

సిద్ధికిని 'నెలగడ్డపాడు'లో ఘోరయుద్ధము జరగినట్లును సంప్ర దాయకథకులు మఱొకకథ చెప్పుదురు. ఆరణమున నల సిద్ధియుఁ గాటమరాజును మరణించిరి.

యాదవులమతమున విష్ణువే కృష్ణుఁడు. కృష్ణుఁడే కాట మరాజు. ఇతనిది ఆదినారాయణ వంశము. అచ్యుతానంద గోత్రము. సురలు యాదవులుగా, సురకాంతలు యాదవ కాంతలుగాఁ బుట్టిరని వారి విశ్వాసము.

ఈతనికి డెబ్బదియేడు బిరుదు లున్నవి. అంభోజ బిరుదు, ప్రళయకాల బిరుదు, సింగిణీతోరణాలు, కనకసింగి ణీలు, విష్ణుబిరుదు, చంద్రబిరుదు, గరుడశార్దూలకనకపడగలు. పిగిలితలాటము, పిగిలికుచ్చులు, పంచలోహతలాట, భస్మ శంకర-యిత్యాది బిరుదులు గలవాఁడు కాటకోటేశ్వరుఁడు.

కాటమరాజుకథను ఖండములుగా ననేకులు రచించిరి. కాటమరాజుకథ, బట్టురాయబారము, ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట, కోటపాటి తాటివృక్షము తెచ్చేకథ, అగుమంచికథ – యిని యన్నియుఁ గాటమరాజుకథకు సంబంధించినగ్రంథ ములే. ఇన్ని ఖండరచనములలోను నఖండముగాఁ దోఁచు పాత్రము 'కాటమరాజు'. అన్ని పాత్రములలోను ముందు నిలిచి కాటమరాజే మనకు దర్శన మిచ్చును. కాటమరాజు పాత్రము మాత్రమే కాదు. ఖడ్గతిక్కన, బ్రహ్మారుద్రయ్య, బీరినాయుఁడు, బొల్లావు అనుపాత్రములు కూడ నట్టివే. అన్ని పాత్రముల యంతస్తత్వముల చిత్రణము – వ్యక్తిచిత్రణ మిం ఖండరచనములయం దన్నిటను నంతటను నుదాత్తము గాను, మహనీయముగాను సాగినది. పాత్రచిత్రణ మింత

యుత్తమస్థాయిలో లేకపోయినచోఁగేవలము శ్రవ్యమేయయి సంప్రదాయకథకుల నోళ్లలో మాత్రమే యుండి వ్రాఁత కోఁతలలో లేని యీ ప్రశస్తగేయరచనము లెప్పుడో యడగారి పోయి యుండెడివి. నేఁడు వానిని దలఁచువాఁ డెవఁడు నుండఁడు. అందులో గొప్పగాఁ జిత్రింపఁబడినపాత్ర చిత్రణమే వానికిఁ బ్రాణము పోసి నేఁటివఱకును వానిని నిలిపి యుంచినది. 'కాటమరాజు కథ'లోఁ గాటమరాజు ప్రశంస యెక్కఁడ వచ్చినను నీ ఖండరచనముల రచయితలు పర వశు లగుదురు. ఒకానొకయావేశమునకు వారు లోనయి నట్లు వారి రచనమే తెలుపఁగలదు. ఆవేశ ముత్తమకవితా విర్భూతికి నొకకారణ మని యందఱకును దెలిసినవిష యమే. ఆయావేశములో కాటమరాజును బేర్కొనుటలో నవలంబింపఁబడిన 'యావృత్తి' విధానమువలన నీ రచ నములలోఁ జాలవఱకు కాటమరాజు రూపచిత్రణమును, పాత్రచిత్రణమును సాధింపఁబడినవి. కాటమరాజు ప్రశం సకు సంబంధించినచరణముల నొకటివెంబడి నొకటిగాఁ గథ కుఁడు వల్లించినపుడు శ్రోతల హృదయములలోనికి కాటమ రాజుస్వరూపము మాత్రమే కాదు. అతని యాత్మ కూడ నవతరించును. దానితో రసానుభూతి పరాకాష్ఠ చెందును. రచనము నాటకీయముగా సాగుటతోఁబాటు 'ఆవృత్తి' విధానావలంబనము కూడ జోడు కలిసి యందుఁ బాత్రచిత్ర ణము సమర్థముగా సాగిపోయినది. అదే పాత్రచిత్రణము గల ప్రబంధములలోకంటె కాటమరాజుకథలో సాధింపఁబడిన ప్రత్యేకత!

పుల్లరియడుగవచ్చిన మనుమసిద్ధిభట్టు'రాయశృంగా
వళి'తో యాదవుల భట్టు కొమారబంగారము పలుకుచున్న
పలుకులివి. కాటమరాజు పరాక్రమము నభివర్ణించి సిద్ధి
భట్టును జెదరఁగొట్టి పంపుట యతని యుద్దేశము. అతని
యుద్దేశ మేది యయినను. కాటమరాజువ్యక్తి యందులో
నద్భుతముగాఁ జిత్రింపఁబడినది.

'విను రాయశృంగార! వివరంబుగాను
ఘన మైనరాజు మాకాటమరాజు
ఉత్తరకాంభోజ ఉర్వీశు లెల్ల
తత్తరించఁగఁ బట్టి తలలను ద్రుంచి
కొంకణదేశాలు కొట్టి సాధించి
వంకిణి కీల్బొమ్మ వరుసఁ జెల్లించె
కాళింగభూమిని గాలావుల మేపి
వెలయంగ సత్కీర్తి వెలసినవాఁడు
ద్రావిడదేశాదిధరణీపులఁ ద్రుంచి
క్రొవ్వు లంచంబుగఁ గుడిపినవాఁడు
మాగధమాళవమతిమారకాక్రముఁ డై
మగసింహబిరుదాంకమాన్యుఁ డైనాఁడు
ఘూర్జరనేపాళకువలయేశ్వరుల
జెల్లఁగా గుదియచేఁ జెల్లించినాఁడు
సింధుకాశ్మీరాది క్షితిపాలకులను
నందంది వారిచేఁ గవు లందినాఁడు
పరఁగ పులిందభూపతుల నిర్జించి

హేలతో రణభేరి వేయించినాఁడు
కుకురకొంకణభూమి గోవుల మేపి
సకలాభిరాముఁ డై చతురత మెఱసి
సుదేష్ణచాళుక్యచోడభూములను
నెదిరించువైరుల నిల నణఁచినాఁడు
అంగవంగభూమి నావుల మేపి
భంగప్రతాపునిఁ బడఁ జంపినాఁడు
పాండ్యసౌవీరాధిపతుల నుగ్గాడి
చాణూరమల్లులఁ జంపినవాఁడు
పాంచాలభూ మెల్లఁ బశువుల మేపి
యెంచఁ గీర్తులచేత హెచ్చినవాఁడు
నుభయవిదర్భవిరోధుల నణఁచి
భుజపరాక్రమముచేఁ బొలుపొందినాఁడు
కోసలకీరాతకుంతలంబులను
వాసిగా మూకల వధియించినాఁడు
సౌరాష్ట్రవీరాటసారదుర్గముల
నవకోటిబిరుదంబు నడపినవాఁడు
మరాటలాటముల మందావుల మేపి
నెఱ సాహసంబుగ నిలిపినవాఁడు
శూరసేనక్షితిపాలకులఁ గొట్టి
బిరుదుపెండెము కాల మెట్టినవాఁడు
మచ్చకురుభూముల మందావుల మేపి
చెలువొంద వారితోఁ జెలి మందినాఁడు
మళయాళగాంధారమహారాష్ట్రములను

చెలరేగి బిరుదులు చెలఁగించినాఁడు
బాహ్లికగాంధారబహుభూములందు
బహుబలశాలియై ప్రబలినవాఁడు
కర్ణాటతుళభూమి ఘనతతో మేపి
దుర్ణయరాజుల దునిమినవాఁడు
కాశ్మీరకర్ణాటపతుల నోడించి (?)
భానుతేజుండయి పరఁగినవాఁడు
కావేరభూమిని కాలాపుల మేపి
నవనాథసిద్ధుల నయము గన్నాఁడు
కర్ణాటద్రావిడగహనభూములను
కోవరాలుండంగఁ గూలార్చినాఁడు
ఎవ్వారు కదియించి యెవరు కినిసినను
నెవరు నారాజుతో నెదిరి నిలిచినను
వానిఁ బోనీయక వసుధపైఁ గూలఁ
బోర నావులచేతఁ బొడిపించినాఁడు
వడసార మీ రాజు వధియింతు ననుచుఁ
గంకణంబులఁ జేతఁ గట్టుకొన్నాఁడు
నిలుచుట ముందర నీతియుఁ గాదు
వెలసిన సాహసవిక్రమఘనుఁడు
ఘూని మీ నెల్లూరి పురవరుల నెల్ల
వెను దగిలి మారాజు వెంట నున్నాఁడు
వదలక పలుమాటు వదరేవు చాలఁ
గదలి రమ్మనుమి మీ కలవారి నెల్ల —

మఱొక చోటఁ గూడ కొమారబంగారము కాటమ రాజును బ్రశంసించుఘట్ట మిది చూడుఁడు—

'రట్టడితన మేల రాయశృంగార!
గట్టిగా నిటు వినుఁ గర్వంబు మాని
యేల శంకిల వీరు లెదిరినఁ గాని
కాలాంతకుం డవుఁ గాటమరాజు
డమరు త్రిశూలంబు తగ మూఁడుకండ్లు
గలదేవుఁ డెంచ మా కాటమరాజు
తగ శంఖచక్రముల్ ధరియించినట్టి
కరివరదుఁ డెంచ మా కాటమరాజు
వర్ణింప యాదవవంశంబునందుఁ
గర్ణుఁ డౌ నీవి మా కాటమరాజు
అర్జునుకైవడి నరివీరవరుల
గర్జించి గెలుచు మా కాటమరాజు
కండతుండెంబులుగాఁ జేయఁ బూని
గద్దించు రిపుల మా కాటమరాజు
పాండునందనులలోఁ బ్రతి యెంచవచ్చు
రణశూరుఁ డైనట్టిరాజశేఖరుఁడు
వినుతి కెక్కినబహువిక్రమోన్నతుఁడు
తనరు షోడశమహాదానవినోది
వినయభాసురుఁడు వివేకసంయుతుఁడు
అతులప్రతాపి మహాధైర్యశాలి
దురితదూరుఁడు బుధతోషితేంద్రుండు

శాస్త్రపాత్రుఁడు సర్వశాస్త్రకోవిదుఁడు
నిఖిలసమర్థుండు నీతిపాలకుఁడు
కాంతిచంద్రుండు మా కాటమరాజు
పొట్టకావరమునఁ బొదివి యిచ్చోట
భట్ట నంచును వచ్చి పలికేవు గాక
యొకరాజు కిరీటంబు నొక కోరడ చేసి
పూని చదివెద వీడఁ బొద్దేమి పోద
యందెలబండివలె నారడికి సైఁచి
నిందలు పల్కఁను నీతియా నీకుఁ
దక్కులు నిక్కులుఁ దటపటమాట
లింకఁ జెల్లవు యిటు వినవోయి! భట్ట!'

* * *

యీదవకథానాయకుఁ డయినకాటమరాజు వ్యక్తిత్వ మీ వాక్యములలో గోచరించుచున్న దనుటలో సందేహము లేదు.

కాటమరాజునకుఁ దరువాతఁ బేర్కొనఁ దగినవారు ఖడ్గతిక్కన. బ్రహ్మారుద్రయ్య. ఈ రెండు పాత్రముల చిత్రణములో 'కాటమరాజు కథ' గేయరచనకర్త గంగుల పిన యెల్లయ యద్భుత మయినప్రజ్ఞను బ్రదర్శించినాఁడు. ఖడ్గతిక్కన విజుగు తెలుఁగునాటఁ బ్రసిద్ధ మయినకథ. కాని దానిని గథావస్తువుగా స్వీకరించి యెవ రేవిధ మయిన రచనము చేసినను నింతకంటెఁ బ్రశస్తతరముగాఁ జేయలే రన్నంత చక్కఁగా రచించినాఁ డీ ఘట్టమును. ఖడ్గతిక్కన

బ్రహ్మారుద్రయ్య లొకరిని మించవలె నని మఱొకరు పోరాడినట్లుగానేకవి కూడ వారి యిద్దఱి చిత్రణములో నొకరిని మించునట్లుగా మఱినొకరిని జిత్రించుటకుఁ బ్రయత్నించినట్లు కనిపించును. విఱిగి వచ్చినఖడ్గతికక్రున మానసికాందోళనమును జాలఁ జక్కఁగా, సహజముగాఁ జిత్రించినాఁడు కవి. పాత్రచిత్రణ మనఁగాఁ గేవల మాకారచిత్రణము కాదు – అంత స్తత్వచిత్రణ మన్నవిషయ మిక్కడ నిరూపిత మయినది. ఆ ఘట్టము ఘట్టి మంతయుఁ జాల సమర్థముగా సాగినది – కొంకు లేనినడకతో – సహజమయినపాత్రచిత్రణముతో.

బ్రహ్మారుద్రయ్యది త్యాగమయజీవితము. అసలు ఖడ్గతిక్రున యెత్తి చన్నది చల్లవారివిూఁద. చల్ల పిన్నమనాయఁడు తిక్రున రణరంగములో మరణించినచోఁ దనకు బ్రహ్మహత్యా మహాపాతక మంటు నని సందేహించుచుండఁగా నతని మంత్రి, శివబ్రాహ్మణుఁడు పిన్నమనాయనికి ధైర్యము సెప్పుచు నన్నమాటలు సాహిత్యములోనే స్థిరముగా, శాశ్వతముగా నిలిచి పోఁ గలిగినవి. బ్రహ్మారుద్రయ్య మాట లివి చూడుఁడు—

‘చింతింప నీ కేల క్షితిత లేశ్వరుఁడ!
చలముకొని పోరాడఁ జను దెంచునపుడు
కులవివేచన సేయఁ గూడ దెవ్వరికిఁ
బణఁతికై రాముఁడు పాపి రావణుని
రణమునఁ ద్రుంపఁడా బ్రాహ్మణుం డనక
వైరి నెక్కు వనక వధియింపవలెను

ఎదిరించినప్పుడు ఎవరైతె నేమి
వధియింప వలెఁ గాని వర్జింపఁ దగదు.
ఇట్లుండె ధర్మ మిం దేల చింతింప
నట్లు గాకయు బ్రహ్మహత్యకై నీవు
వెనుకాడెదవ యేని విను చల్లపిన్న!
ఆజిలో నీవ నేనై యొప్పఁగలను
బ్రాహ్మఁ డాతఁడు శివబ్రాహ్మఁడ నేను
బ్రాహ్మణులము పోరు పాటింపఁగలము
ఆతని నేఁ జంపు టది ముఖ్య మాయె
నతనిచేత నె నేను హత మైతి నైన
యాదవకులనాథ! యిది వినవయ్య!
గోదావరియు నెల్లగొండ లెన్నాళ్లు
ఆదిత్యచంద్రులు నవని యెన్నాళ్లు
అన్నాళ్లు వెలయు నీయాదవకథయుఁ
గలియుగ మెన్నాళ్లు కలుగు నన్నాళ్లు
నవనిలో నాపేరు అర్చితం బగును
హరహరా! హరహరా!' యని బ్రహ్మరుద్రుఁ
డరు దైనతలమోఁది యాశివలింగ
మచ్చోట వెలయించె నర్చన లిచ్చె —

*　　*　　*

సాధారణముగాఁ బాఠకులకుఁ గాని, శ్రోతలకుఁ గాని వీరోచిత పాత్రములమోఁదకంటెను గరుణపాత్రములమోఁద సానుభూతి యెక్కువ. కాటమరాజుకథలో బీరినాయనిపాత్ర మట్టిది. బీరినాయఁడు చండాలకులజుఁడు. కాటమరాజు ఎట్టి

గడ్డపాటి పోట్లాటలో జల్లవారు మొదలయినవారి కందటికిని వారివారికి దగినతాణ్యము లేర్పాటు చేసి బీరినాయనికి మాత్ర మతనిమీది యధికవాత్సల్యముచేతనే, యతని తల్లికి దా నిచ్చియుండిన వాగ్దానముచేతనే తాణ్యము నేర్పాటు సేయలేదు. అది తెలిసి బీరినాయుడు కాటమరాజును దయనీయముగా ప్రార్థించుఘట్టము కరుణరసభూయిష్ఠము. అది విని కన్నీరు కార్పనివాడుండడు. ఇట్టి కరుణపాత్ర సృష్టిలోనే కాక దాని చిత్రణనిర్వహణమునం గూడం గవి ప్రదర్శించినప్రజ్ఞ యసామాన్యము!

తరువాతిపాత్రము బొల్లావు. తిర్యక్కులకుం గూడ వ్యక్తిత్వము రూపించి పాత్రత్వము కల్పించినకవులు తెలుం గులోం జాలమంది యున్నారు. సూరన్న శుచిముఖి యట్టి పాత్రము. కాటమరాజుకథలో బొల్లావుయుద్ధము మఱిపునకు రానిది. ఆ యుద్ధఘట్టములో దానిధాకకుం జెదరిన మనుమసిద్ధి సైనికులచేష్టలు, మాటలు, సహజతకుం జాల సన్నిహితముగా నుండి మనోజ్ఞ మయినదృశ్యమును ప్రదర్శించుచున్నది. పాత్రచిత్రణమున నీపట్టులోం గవి ప్రదర్శించిన నేర్పు కేవలప్రతిభాజన్యము కాదు. అనుభవపూర్వకము. లోకానుభవ మెంతో యున్నరచయిత కాని యట్టిరచనను జేయ లేడు. అట్టి పాత్రపోషణము కావింప లేడు.

కాటమరాజుకథలో రచయితలు పాత్రచిత్రణము విషయములో నవలంబించినవిధానము నిది దిఙ్మాత్రముగా మాత్రమే తెలుపుచున్నది. ఇంకను నాయాపాత్రముల చిత్రణములలో వారు చూపినమెలకువ లనంతములు!

చిత్రాంగి

ధర్మవరమువారి విషాదసారంగధరనాటకమున చిత్రాంగి నాయికయుఁ, బ్రధానపాత్రయు నై యొప్పుచున్నది. ఈమె రాజరాజనరేంద్రునికి సామంతుఁడగుభోజరాజు కుమార్తె. అతిలోకసౌందర్యవతి. 'లోకమోహనమనోహరరూపిణి.' 'మదనశాంబరీశబరవిముక్తలీలాకురంగి'. 'కళాకలితవిలాస లలితాక్షీణకళానిధినిటాల.' 'రతీసతీసమాదృతమయూరి.'

రాజరాజు తనకుమారుఁడగుసారంగధరునికై కన్యల నన్వేషించుటకొఱకు దేశదేశములకు బ్రాహ్మణులను బంపి నాఁడు. అందు హిరణ్యుఁడనుబ్రాహ్మణుఁడు విదర్భరాజ పుత్రిక యగుచంద్రకళాదేవి పటమును, విభావసుఁడను బ్రాహ్మణుఁడు భోజరాజపుత్రి యగుచిత్రాంగిదేవి పటమును దెచ్చిరి. ఆచిత్రపటములఁ జూచి రాజరాజు విదర్భరాజ పుత్రిక యగుచంద్రకళాదేవిని దన కుమారుఁడగు సారంగ ధరునికై యెన్నుకొని, భోజరాజపుత్రిక యగుచిత్రాంగి దేవిని దాను వివాహ మాడఁదలఁచి భోజరాజునకుఁ గబురు పంపినాఁడు. ఆతఁడు రాజరాజునకు సామంతుఁడు. అందుచే దన కిష్టము లేకున్నను నాతఁ డా వివాహమునకు సమ్మ తింప వలసి వచ్చినది. ముదుసలి యైనరాజరాజుతో నన యౌవనవతి యగుచిత్రాంగికి వివాహము జరగిపోయెను.

విభావసుఁడు సారంగధరునికై కన్య నన్వేషించుచుఁ బోయినప్పు డాతఁడు తనవెంట సారంగధరుని చిత్రపటమును గూడఁ గొనిపోయి యుండెను. అందలి సారంగధరుని చిత్ర పటముఁ జూచినవెంటనే చిత్రాంగిహృదయ మామోహనాం గుని కంకిత మై పోయినది. ఆ చిత్రపటముఁ దెచ్చినవిభావసు నామె రహస్యముగఁ దనయంతఃపురమునకుఁ బిలిపించి తన మనవిని సారంగధరుని కెంతో చెప్పు మన్నది. 'నిన్నుఁ గా కింకొకఁ రిని బతిగాఁ బడయ' నని విన్నవింపు మన్నది. కాని యామె దురదృష్టముచే రాజరాజే యామెను వివాహ మాడ నెంచుటచే విభావసుఁ డందుచే భయపడి సారంగ ధరునికిఁ జిత్రాంగిహృదయమును దెలుపకయే పోవుట తటసించెను. బలవంతమున రాజరాజుతో వివాహ మయి నను చిత్రాంగి మాత్రము సారంగధరునికి నంకితము చేసిన తనహృదయము నాతనినుండి మఱలించుకొనఁ జాలక పోయెను. ఆతని చిత్రపటమును సదా తన హృదయసీమ నుంచుకొని యామె కొంతకుఁ గొంత మనశ్శాంతి పొందు చుండినది. చెడుత్రోవ నైనను దన కోరికను దీర్చుకొననే నలయు నని యామె నిశ్చయించుకొనినది.

తానుమనసారఁ గోరినకోరిక యీడేరనపుడు మానవ హృదయ మాకోరిక నీడేర్చుకొనుటకై తప్పుదారుల వెద కును. చిత్రాంగిహృదయము కూడ నట్టిదిగానే పరిణమించినది. ఆమెలోని వాంఛ తీరనివాంఛ. అది రేకెత్తుటకుఁ జక్కని యవకాశ మొక్కటి దైవవశమున నామె కేర్పడినది. వింధ్యా టవినుండి యొక శబరుఁడు వచ్చి క్రూరమృగముల బాధమిక్క

టముగ నున్నదని విన్నవింపఁగా రాజరాజు వేఁటకుఁ బ్రయాణ
మయ్యెను. అతఁడు చిత్రాంగి యంతఃపురికి వచ్చి యామెకడ
సెలవుఁ గయికొనునప్పు డామె యెంతయు సంతసించినది.
'నేను వింధ్యాటవికి నీమధ్యాహ్నమున వేఁటకు వెడలెద 'నని
యాతఁడు పలుకఁగానే సారంగధరునిఁ గలిసికొనుటకుఁ దనకుఁ
జక్కని యవకాశ మొకటి లభించిన దని యామెహృదయము
ఉఱుకలు వేయ సాగినది. 'హృదయమా! తొందర వల 'దని
యామెయాయుద్యోగము నడఁచుకొని రాజరాజుపై లేనివలపు
కురియించుచుఁ దన్నుఁ గూడ వేఁటకుఁ గొని పో మ్మనియు,
నాతఁడు లేకున్నఁ దాను జీవింపఁజాల ననియు నెన్నో కల్ల
బొల్లికబురులు చెప్పినది. రాజరాజు పాపము! చిత్రాంగి
తనపై వలపు కురియుచున్న దనియే భ్రమించినాఁడు!

చిత్రాఁగి తనకు లభించినయమూల్యావకాశమును జాఱి
విడుచుకొనఁ దలఁప దయ్యెను. దైవము కూడ విచిత్రముగ
నామెదుష్టసంకల్పమునకుఁ గలసి వచ్చెను. రాజు వెడలిన
యేడుదినములదాఁక నామెసారంగధరునిమీఁది ప్రేమ నెట్లో
యడఁచుకొని యుండినది. ఇఁక నా రెండుదినములును గడచి
పోయినయెడల రాజు రానే వచ్చును. అపుడు తనకోరిక కిఁక
స్వస్తి! అందుకై యామె సాహసించి-యతిభాషిణి కానిది,
యమాయకురాలు కానిది, మిక్కిలి ఉపాయశాలిని కానిది-
యగుచెలిక త్తెకె వెదకి,తుదకు 'కమల' యనుదాసిమూలమున
సారంగధరునికి నొకజాబు వ్రాసి పంపెను. ఆజాబు వ్రాయు
టలోఁ జిత్రాంగి ప్రదర్శించిననేర్పసామాన్యము. ఆద్యంత
ములఁ గలయతురములఁ గూడి చదివినచోఁ దనకోరిక

తెలియునట్లు చిత్రముగ నాజాబు నామె రచించెను. కాని చిత్రాంగి మరదృష్టవశమున సారంగధరుఁ డప్పు డింట లేకుండుటచే నాయుత్తర మాతనికిఁ జేరనే లేదు. దానిని కమల ధార పోయిన దని చెప్పి తనకడనే యుంచుకొనెను.

పదునాఱేండ్లు పసిమిప్రాయమున నుండినచిత్రాంగి సారంగధరునిఁ దనవలలో వేసికొనుటకుఁ బన్నినయుపాయముల నెక్కడ నేర్చినదో యెఱుఁగ రాదు. ఆమెహృదయములోఁ బీఠము వేసికొని కూర్చుండినమన్మథుఁడే యామె కాచెయిదముల నేర్పి యుండనోపును! ప్రొద్దుపోకకై యామె మేడపై నిలుచుండి పురసౌందర్యము వీక్షించుచుండఁగా సారంగధరుని పావురము చిత్రముగ నామెమేడపై వ్రాలినది. అపు డామె యాపావురమును బంధించి, సారంగధరుఁడు దానికై తనయంతఃపురికి వచ్చునట్లు చేసికొనినది. ఆతఁడు వచ్చుసరికిఁ దనయంతఃపురమున నెవరును లేకుండునట్లు పరిచారికల నెల్ల నేవో పనులమీఁదఁ బంపి తా నొంటరిగ నుండెను. ఆతఁడు వచ్చినంతనే యతనిని లోనికిఁ దీసికొనిపోయి "ఆ రాజును వేఱు, నిన్ను వేఱుగఁ జూచెదనా? బహుదినములనుండి నీపై నాకుఁ గడు ప్రేమ" యని నర్మగర్భముగ మాటలాడినది. ఫలాహారము భుజించుట కనునెపమున నాత నిచేఁ గవచాదులఁ దీయించినది. తరువాత నతనిని దనశయ్యా గృహమునకుఁ దీసికొనిపోయి "యిదియే నీపడకటిల్లుగఁ జూచి యానందింపుము. నీయిష్టానుసారముగ నీవు కోరిన వన్నియు నిందు నెఱవేరఁ గలదు. ఎన్నిపద్మినులపై నీకాయషట్పద మిదివఱకుఁ దిరుగాడి యున్నదో-" ఇత్యాదిగ నర్మగర్భముగ

మాటలాడినది. శృంగారరసోద్బోధము లగుచిత్రపటములఁ జూపియెన్నివిధములఁ బ్రయత్నించినను నాతనిలోఁ జలనము కలుగ లేదు. ఇఁక లాభము లే దనుకొని యామె తనకోరి కను బహిరంగముగ వెల్లడించెను. అతఁ డుది పాప మనఁగా కుంతీదేవిని దృష్టాంతమునకుఁ దెచ్చి తనకార్యమును సమర్థించుకొనఁ జూచెను. అతఁ డెంతకును లోఁబడక పోఁగా నతనిని నాలింగనము చేసికొనఁ బోయెను. అంత నాతఁడు తన యుత్తరీయమును గూడ మాని యచటినుండి వెడలి పోఁదలఁపఁగా చిత్రాంగి యాతని ననేకవిధముల బెదరించినది. 'మానిని సాహసింపఁ బొడఁగెనా యది యొనర్పఁజాలని కార్యమే లేదు. నామనోధనము గ్రహించితివి. దాని ననుభవింపకున్న నిన్నుఁ దక్కనీయను సుమా ! నాసాహసమున నీకుఁ బ్రాణాపాయమును బొసఁగింతును' ఇత్యాదిగ సారంగధరు నామె బెదరించినది. కాని శీలసంపన్నుఁడయినసారంగధరుఁ డామెబెదరింపులకు భయపడక తనయుత్తరీయమును గూడ నచ్చటనే దిగవిడిచి వెడలి పోయినాఁడు.

ఆశాభంగము పరమానము ననునవి మానవహృదయమున నొకొక్కప్పుడు విషాదలము నుద్దీపింపఁ జేయును. సారంగధరుఁడు తనకోరికను గా దనుటచేఁ జిత్రాంగి పగఁబట్టినప్రాచువలె నాతనిపై బుసలు కొట్టసాఁగినది. ప్రతీకారవాంఛ యామెలోఁ దీవ్రముగా రేకెత్తినది. సారంగధరుని చిత్రవధఁ జేయించిన పిదపఁ గాని యామెకు నాత్మశాంతి కలుగ నంతగా నామె క్షోభించినది. ఎట్టి సాహసమయినను జేయుటకు నామె వెనుదీయ లేదు. రాజరాజు

వచ్చిన వెంటనే యామె యనేకవిధముల నాతనిచేఁ బ్రార్థింపఁ బడి 'రాజచంద్రా! నిన్నటితోఁ దొలుతటివాఁవి నాకుఁ దప్పెను. నీవు నాకుఁ బతివి గావు. మామవు సుమా!' యని సారంగధరునిపై మాతృతల్పగమన మనుదోషము నంటఁ గట్టినది. ముదుసలి యగురాజరాజు యుక్తాయుక్తములఁ నాలోచింపక సారంగధరునిపైఁ గోపము వహించినాఁడు. చిత్రాంగి యాతని చిత్తైర్యమును బరీక్షించుటకై 'తరుణులన్న నీకు వేనవేలు కలుగఁ గలదు. ఎట్టి దుశ్చరితుఁడై యుండినను నొక పుత్రుఁడు లభింపవలె నన్న నరుదు. కావున వానిని క్షమించుట ధీరగుణము'—అని పలికి రాజరాజులోని, కోపమును మఱింత ప్రజ్వరిల్లఁ జేసినది. సారంగధరుఁడు పంపినయుత్తరమును జూచి మంత్రుల ప్రోత్సాహముపై మఱొకతూరి చిత్రాంగిని "ఏమి జరగినది? ఉపమానపూర్వకముగఁ జెప్పు' మని రాజరాజడుగఁగా నామె తనపరపుక్రింద నుండినసారంగధరుని యుత్తరీయమును దీసి 'యిది నా కథ యంతయుఁ జెప్పఁగల' దని పలికి గడుసుఁదనమున నాతనికరవాలముతోఁ దనకంఠమును నఱుకుకొనఁ బోయినది. అతఁడామెను వారింపఁగా 'మామా! ఖండింపుము. ఖండింపు' మని యథార్థముగ దుఃఖించునట్లు నటన చేసినది. అంత రాజరాజు సందేహము వీడి సారంగధరుని భుజపాదఖండనము గావింపుఁ డని తనభటుల కాజ్ఞాపించినాఁడు.

అంతటితో నామెకసి దీఱినది. ఆతరువాత గూడ రాజరాజు తన నిశ్చయమునుండి మఱల కుండునటుల నామె యెప్పటి కప్పుడు తగిన జాగరూకత వహించుచునే యుండి నది. కాని యెట్టకేలకు రాజరాజునకు చిత్రాంగి దుశ్చేష్ట తెలిసి పోయినది! 'ఈ దురాతిశయమును కోటవాకిట మూఁడుదినములు కట్టియుంచి పిదపఁ గుక్కలకు వేయుఁ' డని రాజరాజు కఠినముగా నాజ్ఞాపించినాఁడు. పాపము! సారంగధరునితోఁ గలయికకై కలలుగన్న చిత్రాంగి తుదకు దుర్మరణము పాలయినది!

చిత్రాంగి యతిలోకసౌందర్యవతి యయ్యు దైవోప హత! ఆమెలోని తీరనివాంఛయే యామెచే నన్ని మహాకార్యములఁ జేయించినది. అది యామెలోని మన్మథపిశాచము తప్ప కాని యామె తప్పు కాదు. ముదుసలులకు వివాహిత లయినపడుచుపెండ్లముల హృదయములకు నామె ప్రతీకము! చిగిర్చి మొగ్గ దొడుగుచున్న యామెలోని యాశాలత మొద లంట నఱుకఁబడుటచే నామె తప్పనిసరిగాఁ గావించిన యాయాయి యకార్యముల కానాఁటి సంఘమే యుత్తరవాది యగును కాని యామె మాత్రము కాఁజాలదు. ఆమె విషాద జీవితమునకుఁ గారణము సంఘము! సానుభూతితో నొక్క నిట్టూర్పును విడుచుట తప్ప మనము చేయఁదగిన దేదియు లేదు!

155807

TL
035,6x
35N56.

2C
Ka
5/15

For Copies apply to:—

Thimmavajjhala Kodandaramaiah,

Head of the Department of Telugu,

Sir Theagaraya College, Madras-21.